విశాఖపట్టణం
మంగళవారం 20 అక్టోబర్ 2026
For a pure tomorrow..
జయ జయహే
epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 249 వెల: రూ.5/- పేజీలు: 8
Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool



పాఠకులు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు,
దసరా శుభాకాంక్షలు
విజయదశమి సందర్భంగా
నేడు సెలవు. బుధవారం
సంచిక వెలువడదు.
పున:దర్శనం గురువారం
సురేష్ పెద్దింటి
మేనేజింగ్ డైరెక్టర్ స్వాన్సికాశ్రీ పబ్లికేషన్స్



# ఇండియా కూటమిలోకి జగన్..!?

**ఎస్ ఈసీ అంశంలో బీజేపీపై విమర్శలు**

**కాక్రోచ్ లకు ఇటీవల మద్దతు.. నిశితంగా గమనిస్తున్న కమలదళం**

**అక్రమాస్తుల కేసులు రోజువారీ విచారణ వేళ కీలక మార్పులు**

**రాష్ట్రంలో మారుతోన్న రాజకీయ సమీకరణాలు**

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇటీవల తీసుకుంటున్న వ్యూహాత్మక రాజకీయ నిర్ణయాలు దేశ రాజధాని ఢిల్లీతో పాటు తెలుగు రాష్ట్రాల్లో సరికొత్త సమీకరణాలకు తెరతీస్తున్నాయి! ఇప్పటివరకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వానికి పార్లమెంటులో "మిత్రపక్షం"గా అండగా నిలుస్తూ వచ్చిన వైసీపీ.. ఇప్పుడు క్రమంగా ..మిగతా 2లో

## వైసీపీకి మరో ఎదురుదెబ్బ

**కేంద్ర బలగాల పిటీషన్ కొట్టివేత**

2

# రప్పా రప్పా రాజకీయాలను సహించం

**రౌడీయిజం చేస్తే ఊరుకోం**

**అభివృద్ధి చూసి ఓర్వలేక ఉన్మాదం**

**ఎన్నికలో ప్రజా మద్దతు చూసి ఓటమి భయం**

**సార్వత్రికం తరహాలోనే స్థానికంలోనూ గెలిపించాలి**

**వైసీపీపై సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు**



(మంగళగిరి - జయజయహే)

ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని ప్రభుత్వం ఎంతమాత్రం వమ్ము చేయలేదని, ఎన్ని సవాళ్లు ఎదురైనా ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అమరావతి సమీపంలోని ఉండవల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల పరిణామాలు, ప్రతిపక్ష వైకాపా తీరుపై సీఎం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రాభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు ఉన్మాదుల్లా వ్యవహరిస్తున్నారని చంద్రబాబు విమర్శించారు. నిరుద్యోగులకు ఎంతో లబ్ధి చేకూర్చే మెగా డీఎస్సీని నిలిపివేసేందుకు కోర్టుల చుట్టూ తిరిగారని, చివరికి రోడ్లను సైతం తవ్వుతూ తీవ్ర విఘాతం కలిగిస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ చేసిన అరాచకాలు, విధ్వంసకర రాజకీయాలు ప్రజల మనసుల నుంచి ఎప్పటికీ తుడిచిపెట్టుకుపోవని చంద్రబాబు అన్నారు. ఎన్నికల కమిషన్ వద్దకు తమ సొంత మీడియాను తీసుకెళ్లి లైవ్ స్ట్రీమింగ్ ఇస్తూ నాటకాలు ఆడుతున్నారని, గతంలో అధికారులపై ఒత్తిడి తెచ్చి తప్పుడు పనులు చేయించడమే కాక వారిని జైలుకు పంపిన ఘనత జగన్‌దేనని ఎద్దేవా చేశారు. కుప్పం, పిఠాపురం, పుంగనూరులతో పాటు పులివెందులలో నామినేషన్ కేంద్రాల వద్ద రాడ్లు, కత్తులతో రౌడీలను దించి ..మిగతా 2లో

# గ్రేటర్ విశాఖ క్వీన్ మేకర్స్ మహిళలే..!

**మేయర్ విజయాన్ని శాసించేది విమెన్ ఓటర్స్ నే.. సామాజికవర్గాల వారీ సోషల్ ఇంజనీరింగ్**



(విశాఖపట్నం - జయజయహే)

సాగర నగరంలో జెండా ఎగురవేసేందుకు రాజకీయ పార్టీలు తహతహలాడుతున్నాయి. గ్రేటర్ విశాఖ కార్పొరేషన్ మేయర్ సీటు అత్యంత ప్రతిష్టాత్మకం కావడంతో రాజకీయ పార్టీలు వ్యూహ ప్రతివ్యూహాలకు పదునుపెడుతున్నాయి. మహిళా ఓటర్లు విజేత నిర్ణేతలుగా ఉండంటతో వారికి గాలం వేసేందుకు ఎత్తులు వేస్తున్నారు. అలాగే సామాజికవర్గాల వారీ కాలిక్యులేషన్.. వేసుకుంటూ ఈక్వేషన్లు సిద్ధం చేసుకుని పొలిటికల్ గ్రౌండ్ లోకి దిగుతున్నారు. రాష్ట్రంలో ఒకే ఒక్క గ్రేటర్ సిటీ కావడంతో ఎలాగైనా పాగా వేయాలని పార్టలన్నీ సోషల్ ఇంజనీరింగ్... ఎలక్షనీరింగ్ కు స్కెచ్ లు వేస్తున్నారు. గ్రేటర్ విశాఖపట్నం నగరపాలక సంస్థ (జీవీఎంసీ) ఎన్నికల్లో మహిళా ఓటర్లు కీలక పాత్ర పోషించే అవకాశం కనిపిస్తోంది. మేయర్ పీఠాన్ని ..మిగతా 2లో



# ప్రజాస్వామ్యబద్ధంగానే ఎన్నికలు

**22 800కిపైగా నామినేషన్లే నిదర్శనం**

**టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ వ్యాఖ్యలు**



2




# పల్లెల్లో ఎన్నికల భేరి

**ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్**

**21 నుంచి 23 నామినేషన్ల స్వీకరణ**

**నవంబర్ 3న పోలింగ్, 5న కౌంటింగ్**

**షెడ్యూల్ వెల్లడించిన ఎస్ఈసీ పునేఠా**

(అమరావతి - జయజయహే)

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. దీంతో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియకు సంబంధించి కీలక ముందడుగు పడింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 21 నుంచి 23 వరకు నామినేషన్లు స్వీకరణ జరుగుతుంది. 24న నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నారు. 25న తిరస్కరణకు గురైన నామినేషన్లకు సంబంధించిన ప్రక్రియ కొనసాగనుంది. అనంతరం ఈ నెల 27న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ..మిగతా 2లో

# రోడ్డున తవ్విన వారిపై నాన్ బెయిలబుల్ కేసులు

**ప్రజాధనంతో నిర్మించిన ఆస్తులను ధ్వంసం చేస్తారా**

**తిరుపతిలోని అనంతసముద్రం దున్నేసిన దండగులు**

**డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సీరియస్**

**కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం**



(తిరుపతి - జయజయహే)

తిరుపతి జిల్లా పరిధిలో కొత్తగా నిర్మించిన రహదారిని ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ట్రాక్టర్‌తో తవ్వి ధ్వంసం చేయడంపై ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం క్షమించరాని నేరమని స్పష్టం చేసిన ఆయన, బాధ్యులైన వారిపై నాన్-బెయిలబుల్ ..మిగతా 2లో

# మైదుకూరులో ఎన్నికల వాయిదా

**స్థానిక ఎన్నికల కీలక పరిణామం**

**19 నామినేషన్ పత్రాల చించివేత**

**తదుపరి ఉత్తర్వులు వచ్చాక ఎన్నిక**

3

## దాచేపల్లి, రాజంపేటలో ఏకగ్రీవాలు

**నగర పంచాయితీలో సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించని వైసీపీ అభ్యర్థి**

**నామినేషన్ ను తిరస్కరించిన ఎన్నికల కమిషన్**

**రాజంపేటలో వైఎస్సారసీపీ అభ్యర్థి నామినేషన్ తిరస్కృతి**

**టీడీపీ అభ్యర్థి మాత్రమే బరిలో నిలవడంతో ఏకగ్రీవం**

**నేటి నుంచి ఉపసంహరణలతో యునామినస్ దారిలో మరికొన్ని**

3



# ఇండియా కూటమిలోకి జగన్..!?

మొదటి పేజీ తరువాయి...

ప్రతిపక్ష 'ఇండియా' కూటమి వైపు మొగ్గు చూపుతోందనే వార్తలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఈ పరిణామాలను భారతీయ జనతా పార్టీ అధిష్టానం అత్యంత నిశితంగా పరిశీలిస్తోంది. ఇటీవల నిర్వహించిన విలేకరుల సమావేశంలో జగన్ చేసిన వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో పతాక శీర్షికలకెక్కాయి. కేంద్ర ప్రభుత్వం 2023లో తీసుకొచ్చిన 'ముఖ్య ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు) చట్టం'కి పార్లమెంటులో మద్దతు ఇవ్వడంపై ఆయన బహిరంగంగా విచారం వ్యక్తం చేశారు. "ఆ రోజు ఆ చట్టానికి మద్దతు ఇవ్వడం నేను చేసిన పెద్ద పొరపాటు, అందుకు ఇప్పుడు పశ్చాత్తాపపడుతున్నాను" అని జగన్ వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా పనిచేయాలని, అధికారంలో ఉన్న ప్రభుత్వాల ప్రభావం దానిపై ఉండకూడదని ఆయన డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో 4.6 మిలియన్ల (46 లక్షల) నకిలీ ఓటర్లను గుర్తించినప్పటికీ, ఓటర్ల జాబితాను సవరించకుండానే ఎన్నికలకు వెళ్లాలని చూడటం ప్రజాస్వామ్యానికి విఘాతమని విమర్శించారు. ఇక నియోజకవర్గాలు, వార్డుల పునర్విభజన కూడా అధికార ఎన్డీయే కూటమికి లబ్ధి చేకూర్చేలా జరిగిందని ఆరోపించారు. మరోవైపు సీజేపీ (కాక్రోచ్ జనతా పార్టీ) నిరసనలకు మద్దతుగా, సోషల్ మీడియా వేదికగా 'ఎక్స్' లో జగన్ చేసిన వ్యాఖ్యలు బీజేపీ వర్గాల్లో ఆందోళన రేపాయి. సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాల అరెస్టును ఖండిస్తూ వారి పట్ల జగన్ సానుభూతి తెలిపారు.



### కేంద్రంలో బీజేపీకి ఎందుకు సవాలు?

పార్లమెంటులో వైసీపీకి లోక్‌సభలో నలుగురు, రాజ్యసభలో నలుగురు చొప్పున మొత్తం 8 మంది ఎంపీలు ఉన్నారు. గతంలో పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), ఆర్టికల్ 370 రద్దు, సాగు చట్టాల వంటి కీలక బిల్లులకు వైసీపీ మద్దతు ఇచ్చింది. అయితే, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే 'రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026'తో పాటు నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లు ఆమోదానికి వైసీపీ మద్దతు బీజేపీకి అత్యంత కీలకంగా మారింది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టడం అవసరం. డీలిమిటేషన్ బిల్లుకు సాధారణ మెజారిటీ (లోక్‌సభలో 272) సరిపోతుంది కాబట్టి ఎన్డీయేకి ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ, 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే లోక్‌సభలో మూడింట రెండు వంతుల మెజారిటీ (360 ఓట్లు), రాజ్యసభలో 164 మంది ఎంపీల మద్దతు తప్పనిసరి. ప్రస్తుతం లోక్‌సభ, రాజ్యసభల్లో ఎన్డీయే కూటమికి సొంతంగా అంతటి మెజారిటీ లేదు. ఈ సమయంలో వైసీపీ దూరం జరిగితే బిల్లుల ఆమోదం కాస్త కష్టతరం కానుంది. జనాభా నియంత్రణ బాగా పాటించిన దక్షిణ భారత రాష్ట్రాలకు పార్లమెంట్ సీట్ల సంఖ్యలో అన్యాయం జరగకూడదని జగన్ ఇప్పటికే స్పష్టం చేశారు.

### తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ సమీకరణల మార్పు!

జగన్ 'ఇండియా' కూటమి వైపు అడుగులు వేస్తే, దాని ప్రభావం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలపై బలంగా ఉంటుందని బీజేపీ అగ్రనేతలు అంచనా వేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్: ఏపీలో కాంగ్రెస్, వైసీపీలు ఒకే వేదికపైకి వస్తే ఓటు బ్యాంకు గణనీయంగా మారే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఉన్న ముస్లిం (9% పైగా), క్రిస్టియన్ (1.37% అధికారికంగా, వాస్తవంగా 10-15% వరకు) ఓటు బ్యాంకు వైసీపీకి అండగా ఉంది. వీరంతా 'ఇండియా' కూటమి వైపు ఏకమొత్తంగా మళ్లితే, అధికారంలో ఉన్న టీడీపీ-బీజేపీ-జనసేన ఎన్డీయే కూటమికి గట్టి పోటీ ఎదురవుతుంది.

తెలంగాణలో వైసీపీ ప్రభావం ప్రత్యక్షంగా లేకపోయినా, రెడ్డి సామాజికవర్గ ఓటర్లు, ఆంధ్ర ప్రాంతానికి చెందిన సెట్లర్ ఓటర్లు విస్తృతంగా ఉన్నారు. జగన్ కూటమి మారితే, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కూకట్‌పల్లి, గచ్చిబౌలితో పాటు ఖమ్మం, సూర్యాపేట వంటి 20 నుంచి 30 నియోజకవర్గాల్లో ఉన్న ఆంధ్ర సెటిలర్ ఓటర్లు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ వైపు పూర్తిస్థాయిలో మొగ్గు చూపే అవకాశం ఉందని భావిస్తున్నారు.

### బీజేపీ విమర్శలు!

జగన్ వైఖరిపై బీజేపీలోని మరో విభాగం తీవ్రంగా స్పందిస్తోంది. జగన్‌పై ఉన్న అక్రమాస్తుల కేసుల్లో సీబీఐ, ఈడీ సంస్థలు కోర్టుల్లో రోజువారీ విచారణ జరపాలని పిటిషన్లు దాఖలు చేసిన తర్వాతి నుంచే ఆయన ఈ రకమైన రాజకీయ విమర్శలు మొదలుపెట్టారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఇది కేవలం తన సొంత కేసుల నుంచి రక్షణ పొందేందుకు, రాజకీయ మనుగడ కోసం ఆడుతున్న నాటకమే తప్ప ఇందులో ప్రజా ప్రయోజనం లేదని పేర్కొంటున్నారు. మరి రానున్న రోజుల్లో జగన్ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో, అవి దేశ- ఆంధ్ర రాజకీయాలను ఎలా మారుస్తాయో చూడాలి.



# వైసీపీకి మరో ఎదురుదెబ్బ

## కేంద్ర బలగాల పిటీషన్ కొట్టివేత

## సింగిల్ జడ్జి తీర్పునకు హైకోర్టు డివిజన్ బెంచ్ సమర్థన

(విజయవాడ - జయజయహే)

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి హైకోర్టులో మరో ఎదురుదెబ్బ తగిలింది. కేంద్ర బలగాల భద్రత నడుమ స్థానిక ఎన్నికలు నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. స్థానిక సంస్థలు జరగనున్న పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాల రక్షణ ఉంచేలా రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. వైసీపీ అభ్యర్థనను తోసిపుచ్చుతూ ఈ నెల 16న హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ తీర్పునివ్వగా.. సింగిల్ బెంచ్ తీర్పును సవాలు చేస్తూ వైసీపీ డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. తాజాగా ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు డివిజన్ బెంచ్ కూడా వైసీపీ అభ్యర్థనను నిరాకరించింది. సింగిల్ జడ్జి తీర్పునే సమర్థిస్తూ కేంద్ర బలగాల మధ్య స్థానిక ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. ఇదివరకే నామినేషన్ల గడువు పెంచాలని హైకోర్టును ఆశ్రయించగా వైసీపీ పిటిషన్ ను కొట్టివేసింది. ఎన్నికల కమిషన్ పరిధిలోని అంశమని, తాము ఈ సమయంలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది.

వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరులో మున్సిపల్ ఎన్నికలు వాయిదా పడ్డాయి. నామినేషన్ పత్రాలను చించివేసినందున, వాటిని పరిశీలించడం అసాధ్యమని పేర్కొంటూ అక్కడ ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ ఏపీ ఎస్ఈసీ అనిల్‌చంద్ర పునేఠా సోమవారం ప్రకటించారు. కడప జిల్లా కలెక్టర్ నివేదిక మేరకు మైదుకూరులో ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే అక్కడ ఎన్నికల కోసం మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చి పోలింగ్ నిర్వహిస్తాం అన్నారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో అనిల్ చంద్రపునేఠా మాట్లాడారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. అక్టోబర్ 21 నుంచి 23 వరకు నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల భద్రతపై ఇటీవల హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. అభ్యర్థుల భద్రత, నామినేషన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు వరకు పటిష్ట భద్రతతో పాటు సీసీటీవీ నిఘా, లైవ్ వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయాలని కోరుతూ వైసీపీ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు నామినేషన్ల ప్రక్రియ నుంచి ఫలితాల వెల్లడి వరకు అభ్యర్థుల రక్షణకు తీసుకుంటున్న పూర్తి వివరాలను తమ ముందు ఉంచాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు స్పష్టమైన నివేదిక ఇవ్వాలని ఎస్ఈసీ కార్యదర్శి, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

# గ్రేటర్ విశాఖ క్వీన్ మేకర్స్ మహిళలే..!

మొదటి పేజీ తరువాయి...

దక్కించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న రాజకీయ పార్టీలకు మహిళా ఓటర్ల మద్దతు అత్యంత కీలకం కానుంది. మరోవైపు, నగరంలో కులాల వారీగా ఓటర్ల బలాబలాలు, సామాజిక వర్గాల మద్దతు ఎవరికి లభిస్తుందనే అంశంపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉండటం గ్రేటర్ పాలిటిక్స్ లో హీట్ రేపుతోంది. జీవీఎంసీ పరిధిలో మొత్తం 18,37,901 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించిన గణాంకాల ప్రకారం, మహిళా ఓటర్ల సంఖ్య పురుష ఓటర్ల కంటే ఎక్కువగా ఉంది. దీంతో మహిళామణులను ప్రసన్నం చేసుకుంటే గానీ ఎన్నికల్లో విజయతీరాలకు చేరలేమని రాజకీయ పార్టీలు లెక్కలు వేసుకుంటున్నాయి. దీంతో మహిళా ఓటర్లను ఎలా తమ వైపునకు తిప్పుకోవాలని పనిలో రాజకీయ పార్టీలు పడ్డాయి. మహిళ తమ వైపు మొగ్గు చూపేలా చేసుకుంటే, గ్రేటర్ సీట్ దక్కుతుందనే వ్యూహరచనల్లో కూడా నేతలు నిమగ్నమయ్యారు.

గ్రేటర్ విశాఖ కార్పొరేషన్లో ఇటీవల ఎలక్షన్ వెల్లడించిన నివేదిక ప్రకారం ఓటర్ల సంఖ్యను ప్రకటించారు. జీవీఎంసీ పరిధిలో మొత్తం 18,37,901 ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు. అయితే రాజకీయ పార్టీలు మొత్త ఓటర్లలో ఏ వర్గానికి చెందిన వారు ఎంతమంది ఉన్నారో ఆరా తీసారు. మొత్తం ఓటర్లలో పురుషులు ఎంత మంది..? మహిళలు ఎంత మంది ఉన్నారో లెక్కలు వేసారు. గ్రేటర్ సిటీలో మహిళా ఓటర్లు 9,30,916 మంది ఉన్నట్లు ఈసీ గణాంకాల్లో తేలింది. పురుష ఓటర్లు 9,06,866 మంది ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈ లెక్కన చూస్తే పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారని తేలింది. పురుషుల కంటే గ్రేటర్ విశాఖలో మహిళా ఓటర్లు 24, 050 మంది అధికంగా ఉన్నారు. సుమారు పాతిక వేల మంది మహిళా ఓటర్లు పురుషుల కంటే ఎక్కువగా ఉన్నారు. ఇతరులు 119 మంది ఉన్నప్పటికీ, మహిళా ఓటర్లే ఓసీ జనరల్ కేటగిరిలో వచ్చిన మేయర్ సీట్ ను శాసించేది అని తేలిపోయింది.

గ్రేటర్ సిటీ లో మహిళ, పురుషఓటర్లతో పాటుగా సామాజిక వర్గాల ఇక్వేషన్ కూడా కీలకంగా మారబోతోంది. సహజంగా సాగర నగరంలో అన్ని వర్గాల ప్రజలు ఉన్నారు. విశాఖలో స్థానికంగా ఉన్నవారితో పాటుగా ఇటు ఉత్తరాంధ్ర నుంచి వలస వచ్చిన వారు, అలాగే తెలుగు రాష్ట్రాల్లో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడిన వారు భారీ సంఖ్యలో ఉన్నారు. అంతేగాక ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపార, వాణిజ్య, ఉద్యోగావసరాల నిమిత్తం వచ్చి స్థిరపడిన వారు కూడా ఉన్నారు. వీరిలో అనేక సమాజికవర్గాలకు చెందిన వారు ఉన్నారు. దీంతో కుల సమీకరణాలపై ఇప్పుడు పార్టీల లెక్కలు వేసుకుంటున్నాయి. విశాఖ నగర రాజకీయాల్లో వివిధ సామాజిక వర్గాల ఓటింగ్ సరళి, స్థానిక నాయకుల ప్రభావం, అభ్యర్థుల సామాజిక నేపథ్యం కూడా ఎన్నికల వ్యూహాల్లో కీలక అంశాలుగా మారే అవకాశం ఉంది. ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల ఎంపిక, ప్రచార కార్యక్రమాలు, స్థానిక నాయకుల సమన్వయం విషయంలో సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. గ్రేటర్ సిటీలో యాదవ, కాపు, మత్స్యకార, వెలమ సామాజికవర్గాలకు చెందిన ఓటర్ల అత్యధికంగా ఉన్నారు. వీరిందరినీ సామాజికవర్గాల వారీ ఆకర్షించే పనిలో నేతలు ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నారు. అంతేగాక ఇతర రాష్ట్రాల నుంచి స్థిరపడిన వారి ఓట్లు గంప గుత్తుగా ఒకే పార్టీకి పడే సంప్రదాయం విశాఖలో కొనసాగుతున్న నేపథ్యంలో ఆ ఒరవడికి బ్రేక్ వేసి వారిలో చీలిక తెచ్చి తమ వైపు తిప్పుకునేందుకు కొన్ని పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి.

మహిళా ఓటర్ల ఆధిక్యం, స్థానిక సమస్యలు, అభ్యర్థుల ప్రజాదరణ, పార్టీ బలం, సామాజిక వర్గాల మద్దతు వంటి అంశాలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయవచ్చు. అయితే మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్నంత మాత్రాన ఒక పార్టీకి విజయం ఖాయమని చెప్పలేం. వారి ఓటింగ్ శాతం, వార్డుల వారీ పరిస్థితులు, అభ్యర్థుల పనితీరు కూడా కీలకం కానున్నాయి. మొత్తంగా గ్రేటర్ విశాఖ ఎన్నికల్లో మహిళా ఓటర్లు, సామాజిక సమీకరణాలు రాజకీయ పార్టీలకు కీలక సవాలుగా మారే అవకాశం ఉంది. మేయర్ పీఠం ఎవరికి దక్కుతుందన్నది ఓటర్ల తుది తీర్పుపైనే ఆధారపడి ఉంటుంది.



# పల్లెలో ఎన్నికల భేరి

ముగియనుంది. అభ్యర్థుల తుది జాబితా అనంతరం ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకోనుంది. నవంబర్ 3న ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. నవంబర్ 5న ఓట్ల లెక్కింపు చేపట్టి ఎన్నికల ఫలితాలను ప్రకటించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక పాలనలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ ఎన్నికల ద్వారా మండల, జిల్లా స్థాయిలో ప్రజాప్రతినిధులను ఎన్నుకోనున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో రాజకీయ పార్టీలు, ఆశావహులు ఎన్నికలపై దృష్టి సారిస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసే తదుపరి మార్గదర్శకాలు, స్థానాలవారీ వివరాలపై అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

### ఎన్నికల షెడ్యూల్ ఒక్కసారి చూస్తే..

అక్టోబర్ 24: నామినేషన్ల పరిశీలన
అక్టోబర్ 25: నామినేషన్ల తిరస్కరణ ప్రక్రియ
అక్టోబర్ 27: నామినేషన్ల ఉపసంహరణ
నవంబర్ 3: పోలింగ్
నవంబర్ 5: ఎన్నికల ఫలితాలు

# రప్పా రప్పా రాజకీయాలను సహించం

మొదటి పేజీ తరువాయి...

భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, పంజాబ్, బెంగళూరు నుంచి గూండాలను రప్పించి రాజకీయాలు చేయాలని చూస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు. స్థానిక సంస్థలు బలోపేతమైనప్పుడే నిజమైన అధికార వికేంద్రీకరణ సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈసారి స్థానిక ఎన్నికల్లో బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు స్వస్తి పలికేందుకు చైర్మన్, మేయర్ పదవులకు ప్రత్యక్ష ఎన్నికల పద్ధతిని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రజాభిప్రాయాన్ని సేకరించి, సోషల్ రీ-ఇంజనీరింగ్‌కు ప్రాధాన్యత ఇస్తూ అభ్యర్థుల ఎంపిక పూర్తి చేశామన్నారు చంద్రబాబు. రాష్ట్రంలో 11 మేయర్ స్థానాలకు గానూ 11 వేర్వేరు కులాల వారిని బరిలోకి దించామని, అందులోనూ అధికంగా మహిళలకే అవకాశమిచ్చామని తెలిపారు. బీసీలకు 39 శాతం ఓటు బ్యాంకు ఉండగా, ఏకంగా 35.05 శాతం సీట్లను కేటాయించామని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం తన ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను కోల్పోయిందని, తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాన్ని పునరుద్ధరిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. సుమారు రూ.లక్షన్నర కోట్లతో సంక్షేమ పథకాలను క్యాలెండర్ ప్రకారం నిర్దిష్ట సమయంలో లబ్ధిదారులకు అందిస్తున్నట్లు చెప్పారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రాయలసీమ వెలిగొండ ప్రాజెక్ట్ ఫేజ్-1ను పూర్తి చేశామని, మార్కాపురం ప్రాంతాన్ని కరవు రహితంగా మారుస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం మళ్లించిన స్థానిక నిధులను, నిర్వీర్యం చేసిన జల్ జీవన్ మిషన్ వంటి 93 కేంద్ర పథకాలను కేంద్రంతో చర్చించి మళ్లీ గాడిన పెట్టామని తెలిపారు. 'రప్పా రప్పా రాజకీయాలు, ఫ్లెక్సీలకు రక్తాభిషేకాలు చేసే సంస్కృతి మనది కాదు. నా జీవితంలో హింసకు తావులేదు. కానీ రౌడీయిజంతో అధికారం దక్కించుకోవాలని చూస్తే మాత్రం సహించేది లేదు.' అని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడి హోదాలో చంద్రబాబు హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఏ విధంగానైతే 94 శాతం స్ట్రైక్ రేట్‌తో ఘన విజయాన్ని అందించారో, అదే రీతిలో స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ మంచి పరిపాలన కోసం కూటమికి ఓటు వేసి ఆశీర్వదించాలని ఆయన ప్రజలను కోరారు.

# రోడ్డున తవ్విన వారిపై నాన్ బెయిలబుల్ కేసులు

మొదటి పేజీ తరువాయి...





సెక్షన్ల కింద కఠిన కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. తిరుపతి జిల్లా పుల్లంపేట మండల పరిధిలోని అనంతసముద్రం గ్రామం నుంచి పాపక్కగారిపల్లె వరకు వెళ్లే బీటీ రోడ్డును రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ. 4.75 కోట్ల వ్యయంతో పునర్నిర్మించింది. అయితే రోడ్డు నిర్మాణం పూర్తయిన వారం రోజులకే.. వైసీపీ నాయకులు సుబ్బారెడ్డి, వెంకటసుబ్బారెడ్డిలు కలిసి ట్రాక్టర్ ఉపయోగించి సుమారు 100 మీటర్ల మేర బీటీ రోడ్డును పూర్తిగా దున్నేసి ధ్వంసం చేశారు. ఈ విధ్వంసాన్ని గమనించిన స్థానిక గ్రామస్థులు వెంటనే పంచాయతీరాజ్, ఇంజినీరింగ్, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఘటన పూర్వాపరాలను అడిగి తెలుసుకున్న పవన్.. అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసిన వైసీపీ నాయకుడు సుబ్బారెడ్డి, అతనికి సహకరించిన వారిపై చట్టప్రకారం నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని పవన్ ఆదేశించారు. ధ్వంసమైన రహదారి పునర్నిర్మాణానికి అయ్యే పూర్తి ఖర్చును నిందితుల నుంచే రికవరీ చేయాలన్నారు. ఈ చర్యకు పాల్పడిన ప్రత్యక్ష నిందితులతో పాటు వారి వెనుక ఉండి ప్రోత్సహించిన సూత్రధారులను కూడా చట్టం ముందు నిలబెట్టాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. భవిష్యత్తులో ఎవరూ ఇలాంటి దుశ్చర్యలకు ఒడిగట్టకుండా కఠినమైన శిక్షలు పడేలా చట్టపరమైన చర్యలు బలంగా ఉండాలన్నారు. 'ప్రజల సౌకర్యార్థం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కోట్ల రూపాయల ప్రజాధనంతో రోడ్లు నిర్మిస్తుంటే, రాజకీయం పేరుతో వాటిని తవ్వేయడం అమానుషం. ఇలాంటి మనస్తత్వాలను ఇకపై ఎంతమాత్రం సహించేది లేదు. ప్రజాధనాన్ని బూడిదలో పోసిన పన్నీరుగా మార్చే శక్తుల ఆటలు ఇక సాగవు. చట్టం తన పని తాను చేసుకుపోతుంది.' అని పవన్ కళ్యాణ్ హెచ్చరికలు జారీ చేశారు. గ్రామస్థులు ఇచ్చిన ఆధారాలు, ఫిర్యాదు మేరకు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు పుల్లంపేట పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారని అధికారులు తెలిపారు. ప్రజా ఆస్తుల విధ్వంసం కింద నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి, నిందితులను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచేందుకు చర్యలు వేగవంతం చేసినట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు.

# ప్రజాస్వామ్యబద్ధంగానే ఎన్నికలు

## 22 800కిపైగా నామినేషన్లే నిదర్శనం

## టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ వ్యాఖ్యలు

(మంగళగిరి - జయజయహే)

ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరుగుతున్నాయనడానికి పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 22,800కు పైగా నామినేషన్లు దాఖలు కావడమే నిదర్శనమని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ స్పష్టం చేశారు. అన్ని పార్టీల నుంచి, అన్ని వర్గాల నుంచి, రాష్ట్రంలోని ప్రతి ప్రాంతం నుంచి అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచేందుకు ముందుకొచ్చారని తెలిపారు. ఒక్క ఓటు కూడా పడకముందే ఎన్నికలపై ఆరోపణలు చేసేవారు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఎన్నికల్లో గెలుపోటములు నిర్ణయించేది మీడియా సమావేశాలు కాదని, ప్రజాక్షేత్రమేనని జగన్‌కు కౌంటర్ ఇచ్చారు. ప్రజల వద్దకు వెళ్లాలని, అంతిమంగా ప్రజలే తీర్పు ఇస్తారని లోకేశ్ వెల్లడించారు.

# దాచేపల్లి, రాజంపేటలో ఏకగ్రీవాలు

**నగర పంచాయితీలో సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించని వైసీపీ అభ్యర్థి**

**నామినేషన్ ను తిరస్కరించిన ఎన్నికల కమిషన్**

**రాజంపేటలో వైఎస్సార్సీపీ అభ్యర్థి నామినేషన్ తిరస్కృతి**

**టీడీపీ అభ్యర్థి మాత్రమే బరిలో నిలవడంతో ఏకగ్రీవం**

**నేటి నుంచి ఉపసంహరణలతో యునామినస్ దారిలో మరికొన్ని**

**(అమరావతి - జయజయహే)**

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ఘట్టంలో కీలకమైన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తయింది. ఈ పరిశీలనలో పలు చోట్ల ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. పత్రాల్లో దొర్లిన తప్పుల కారణంగా కొందరి నామినేషన్లు తిరస్కరణకు గురవగా, ప్రధాన పార్టీల అభ్యర్థులకు ఏకగ్రీవ అవకాశాలు దక్కాయి. మరోవైపు శాంతిభద్రతల సమస్యలతో ఏకంగా ఒక చోట ఎన్నికే వాయిదా పడింది. పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ ఎన్నికలో టీడీపీకి లైన్ క్లియర్ అయింది. ఇక్కడ వైఎస్సార్సీపీ ఛైర్మన్ అభ్యర్థి కొప్పుల రవి నామినేషన్ తిరస్కరణకు గురైంది. ఆయన రూ.3,000 సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించకపోవడంతో ఎన్నికల అధికారులు




ఈ నిర్ణయం తీసుకున్నారు. టీడీపీ అభ్యర్థి తంగెళ్ల శ్రీనివాసరావు నామినేషన్‌కు ఆమోదం లభించింది. దీంతో దాచేపల్లి నగర పంచాయతీ టీడీపీకి ఏకగ్రీవం కానుంది. అలాగే అన్నమయ్య జిల్లా రాజంపేట మున్సిపాలిటీ కూడా ఏకగ్రీవం దిశగా సాగుతోంది. ఛైర్‌పర్సన్ బరిలో ముగ్గురు నామినేషన్లు వేయగా, వైఎస్సార్సీపీ అభ్యర్థితో పాటు మరొకరి నామినేషన్‌ను అధికారులు తిరస్కరించారు. దీంతో టీడీపీ అభ్యర్థి దొంతం గాయత్రి మాత్రమే పోటీలో మిగిలారు. అలాగే చిత్తూరు జిల్లా నగరి మున్సిపల్ ఛైర్మన్‌గా టీడీపీ అభ్యర్థి శ్రీనివాసన్ ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది. ప్రొద్దుటూరులో వైఎస్సార్సీపీ మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థి పోరెడ్డి నరసింహారెడ్డి, కాంగ్రెస్ ఛైర్మన్ అభ్యర్థి ఇర్ఫాన్ బాషా నామినేషన్లను తిరస్కరించారు.

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. పురపాలక సంఘ ఎన్నికల్లో ఒకే ఇంటి నుంచి అత్తాకోడళ్లు ఛైర్‌పర్సన్ రేసులో నిలిచారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపూడి శ్రీనివాసరావు సతీమణి, మాజీ కౌన్సిలర్ జ్యోతి బీజేపీ నుంచి ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. మరుసటి రోజే ఆయన కోడలు దీప్తి జనసేన తరఫున ఛైర్‌పర్సన్ స్థానానికి, అలాగే 28వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. శ్రీనివాసరావు 27వ వార్డుకు నామినేషన్ వేశారు. పొత్తులో భాగంగా స్థానికంగా కూటమి నేతల మధ్య సఖ్యత కుదరకపోవడంతోనే ఇలా ఎవరికి వారు నామినేషన్లు వేసినట్లు తెలుస్తోంది. పార్టీల నుంచి బీఫారం రాకపోతే వీరు విత్‌డ్రా చేసుకుంటారా లేదా స్వతంత్రులుగా పోటీ చేస్తారా అన్నది ఆసక్తిగా మారింది. కర్నూలు నగరపాలక సంస్థ మేయర్ స్థానానికి మొత్తం 17 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. పరిశీలన అనంతరం 16 మంది పత్రాలను అధికారులు ఆమోదించారు. వైఎస్సార్సీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే సతీమణి శ్యామల, టీడీపీ నుంచి బొల్లెద్దుల ప్రత్యూష నామినేషన్లు వేశారు. కర్నూలు ఓటరు జాబితాలో పేరు లేకపోవడంతో అమడగుంట్ల శ్యామల అనే స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురైంది. మరోవైపు శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నగర పంచాయతీలో జనసేన ఛైర్మన్ అభ్యర్థి ఎస్.ఈ.శ్రీనివాసులు నామినేషన్ తిరస్కరణకు గురైంది. ఆయన నామినేషన్ పత్రాల్లోని కొన్ని గళ్లను ఖాళీగా వదిలేయడమే ఇందుకు కారణమని అధికారులు వెల్లడించారు.




# మైదుకూరులో ఎన్నికల వాయిదా

**స్థానిక ఎన్నికల కీలక పరిణామం**

**19 నామినేషన్ పత్రాల చించివేత**

**తదుపరి ఉత్తర్వులు వచ్చాక ఎన్నిక**

**(అమరావతి - జయజయహే)**

స్థానిక సంస్థల ఎన్నికల వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు మున్సిపాలిటీ ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం తాత్కాలికంగా నిలిపివేసింది. నామినేషన్ కేంద్రంలో పత్రాల ధ్వంసం ఘటనను తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్‌ఈసీ ఉత్తర్వుల ప్రకారం.. అక్టోబర్ 17న మధ్యాహ్నం సుమారు ఒంటి గంట సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు మైదుకూరు మున్సిపల్ నామినేషన్ కేంద్రంలోకి చొరబడి 19 నామినేషన్ పత్రాలను చించివేశారు. ఈ ఘటనలో 18 మంది అభ్యర్థులు ప్రభావితమయ్యారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు మేరకు అదే రోజు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభావిత అభ్యర్థులు తిరిగి నామినేషన్లు సమర్పించేందుకు అధికారులు అవకాశం కల్పించారు. అక్టోబర్ 18న మధ్యాహ్నం 3 గంటల్లోపు కొత్త పత్రాలు సమర్పించాలని సూచించారు. అవసరమైన భద్రతా ఏర్పాట్లు కూడా చేశారు. అయితే, 18 మంది అభ్యర్థుల్లో బీజేపీకి చెందిన 21వ వార్డు అభ్యర్థి మచునూరి శ్రీదేవి మాత్రమే తిరిగి నామినేషన్ దాఖలు చేశారు. మిగిలిన 17 మంది స్పందించలేదు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అథారిటీ నివేదికలను పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల సంఘం మైదుకూరు మున్సిపాలిటీ చైర్‌పర్సన్, వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించిన తదుపరి ప్రక్రియను నిలిపివేసింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ నిలుపుదల కొనసాగుతుందని స్పష్టం చేసింది. దీంతో మైదుకూరు మున్సిపల్ ఎన్నికల భవిష్యత్తుపై ఉత్కంఠ నెలకొంది.



# రాయచోటిలో 44కు 44 వార్డులు టీడీపీ ఏకగ్రీవం

**వైసీపీ ప్రజాదరణ కోల్పోయింది**

**మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**

**రాయచోటి, అక్టోబర్ 19, జయ జయహే**

రాయచోటి మున్సిపల్ ఎన్నికల్లో 44కు 44 వార్డులు ఏకగ్రీవం కావడం చారిత్రాత్మకమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. రాయచోటిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసీపీ ప్రజాదరణ కోల్పోయిందని, పోటీ చేసేందుకు ఆ పార్టీ నాయకులే ముందుకు రావడం లేదని విమర్శించారు. రెండున్నరేళ్లుగా ప్రజలకు దూరంగా ఉన్న వైసీపీ నాయకులు ఇప్పుడు ఎన్నికల సమయంలో అభ్యర్థులను పోటీకి ప్రోత్సహించడం విడ్డూరంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ప్రజల్లోకి వెళ్లి ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. వైసీపీ పోటీ చేయని వార్డుల్లోనూ ప్రజలకు అండగా ఉంటామని, రాయచోటి అభివృద్ధిపై వైసీపీ నేతలతో బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించారు. కూటమి ప్రభుత్వ రెండున్నరేళ్ల పాలనలో రాయచోటిలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయని తెలిపారు. పట్టణ తాగునీటి సమస్య పరిష్కారానికి వెలిగల్లు జలాశయం నుంచి రెండో పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో పార్కులు, ఇండోర్ స్టేడియం, సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. మాదకద్రవ్యాల ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని, యువత భవిష్యత్తుతో చెలగాటమాడితే సహించేది లేదని స్పష్టం చేశారు. రిగ్గింగ్, బూత్ క్యాప్చరింగ్ వంటి అక్రమాలకు తావులేకుండా ఎన్నికల అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే తమ లక్ష్యమన్నారు. రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికలకు కూటమి శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాయచోటిలో కూటమి విజయానికి కృషి చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు మంత్రి అభినందనలు తెలిపారు.

# టెక్కలి జడ్పీటిసి కూటమి అభ్యర్థిగా ప్రీతీష్ చందు

**రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చన్న సమక్షంలో ఖరారు**

**టెక్కలి అక్టోబర్ 19 జయ జయహే**



శ్రీకాకుళం జిల్లా టెక్కలి జడ్పీటిసి కూటమి అభ్యర్థిగా ప్రీతీష్ చందు ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు సమక్షంలో కూటమి నాయకులు ప్రతిపాదనతో రెయ్యి ప్రీతీష్ చందు ను ఖరారు చేశారు. టెక్కలి కి చెందిన ప్రీతీష్ చందు గత కొన్నేళ్లుగా తెదేపా క్రియా శీలక కార్యకర్తగా పార్టీ కి సేవలందిస్తున్నారు, ఈయన కుటుంబ నేపథ్యం తండ్రి రెయ్యి పున్నయ్య విశ్రాంత జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గా పని చేశారు, తల్లి రెయ్యి మురళి వేణి విశ్రాంత ఉపాధ్యాయురాలు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా గుర్తింపు పొందారు, 2013 లో తెదేపా తరపున టెక్కలి జడ్పీటిసిగా పోటీ చేశారు. విద్యావంతుల కుటుంబం నుంచి వచ్చిన ప్రితీష్ చంద్ మంచి ప్రజా నేతగా ఎదిగి సేవలందించాలని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# స్థానిక ఎన్నికల్లో 'గ్యాస్ సిలిండర్'ను గెలిపించండి

**సామాజిక బాధ్యతగల అభ్యర్థులకు ఆర్పిసి ఆహ్వానం**

**రాజమహేంద్రవరం: జయ జయహే అక్టోబర్ 19:**

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్పీసీ అభ్యర్థులను గెలిపించి, కూటమి ప్రభుత్వ విధానాలపై ప్రజలు ఓటుతో నిరసన తెలియజేయాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పార్టీ వారాంతపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సామాజిక బాధ్యతగల అభ్యర్థులను ప్రోత్సహిస్తామని తెలిపారు.పల్నాడు జిల్లా వినుకొండ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి షేక్ మస్తాన్ వల్లి పసుమర్తి, జిల్లా అధ్యక్షుడు ఆర్.కె. నాయుడు ఆధ్వర్యంలో బెదిరింపులు, ఒత్తిళ్ల మధ్య నామినేషన్ దాఖలు చేశారని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల్లోనూ కొందరు నామినేషన్లు వేయలేకపోయారని ఆరోపిస్తూ, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికల సంఘం, పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.పరిశుభ్రత, స్వచ్ఛమైన తాగునీరు, నాణ్యమైన విద్య, పన్నుల పారదర్శకత, పర్యావరణ పరిరక్షణ, మెరుగైన పౌర సేవలు, గ్రామీణ మౌలికసదుపాయాలు, కల్తీ రహిత ఆహారం తమ పార్టీ ప్రధాన అజెండాలని తెలిపారు. పరిశుభ్రత పాటించే ఇళ్లకు ఆస్తిపన్నులో 10 శాతం రాయితీ, ప్రతి ఇంటికి రెండు చెట్లు, గ్రంథాలయాల ఏర్పాటు, తాగునీరు అందని ప్రాంతాల్లో నీటి పన్ను రద్దుకు కృషి చేస్తామని చెప్పారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు రుసుము చెల్లింపు, ఫామ్-ఏ, ఫామ్-బీ జారీ, 'గ్యాస్ సిలిండర్' గుర్తుతో పోటీకి సహకరిస్తామని తెలిపారు. ఆసక్తిగల వారు వివరాలను పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపాలని కోరారు. ఓట్ల కొనుగోలు, మద్యం, బిర్యానీ వంటి ప్రలోభాలకు పార్టీ దూరమని స్పష్టం చేశారు.సమావేశానికి ఆర్పిసి సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు అధ్యక్షత వహించగా, డి.వి. రమణమూర్తి, బర్ల ప్రసాద్, దుడ్డే సురేష్,




# మేయర్ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలి

**వైసిపి రాష్ట్ర కార్యదర్శి నక్కా శ్రీనగేష్**

రాజమహేంద్రవరం: జయ జయహే : అక్టోబర్ 19:రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఎన్నికల్లో వైసీపీ మేయర్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ నాయకుడు నక్కా శ్రీనగేష్ కోరారు. 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న తన పేరును పార్టీ అధిష్ఠానం పరిశీలిస్తుందనే నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.సోమవారం రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2002లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున మేయర్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం తృటిలో చేజారిందన్నారు. ప్రస్తుతం మేయర్ పదవిని ఎస్సీ జనరల్ కేటగిరీకి కేటాయించిన నేపథ్యంలో వైసీపీ తరఫున పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని పార్టీ అధిష్ఠాన పెద్దలను కోరుతున్నట్లు తెలిపారు. తన అభ్యర్థిత్వంపై పార్టీ పెద్దలు సానుకూలంగా ఉన్నారని పేర్కొన్నారు.గతంలో రూరల్ నియోజకవర్గ పరిశీలకుడిగా బాధ్యతలు నిర్వహించానని, ప్రస్తుతం పెద్దాపురం నియోజకవర్గ పార్టీ పరిశీలకుడిగా కొనసాగుతున్నానని చెప్పారు. నగరపాలక సంస్థ ఎన్నికలను సజావుగా నిర్వహించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న టిడిపి పై ఉందన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని నక్కా శ్రీనగేష్ కోరారు.

# చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి

**రాష్ట్ర ప్రజలకు హోం మంత్రి అనిత శుభాకాంక్షలు**

**నక్కపల్లి, అక్టోబర్ 19, జయ జయహే**



చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి పర్వదినమని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. దసరా పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలతో పాటు పాయకరావుపేట నియోజకవర్గ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దుర్గామాత ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని, రైతుల కష్టానికి తగిన ఫలితం దక్కాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో, మంత్రి నారా లోకేష్ చొరవతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తామని మంత్రి అనిత స్పష్టం చేశారు.

# బాలల నాలుగో ప్రపంచ తెలుగు మహాసభల తేదీల మార్పు

**డిసెంబర్ 19, 20 తేదీల్లో ఒంగోలులో నిర్వహణ**

**ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డా. గజల్ శ్రీనివాస్**




ఒంగోలు, అక్టోబర్ 19, జయ జయహే : ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నాలుగో ప్రపంచ తెలుగు మహాసభల (బాలల) తేదీలను మార్చినట్లు పరిషత్ అధ్యక్షుడు డా. గజల్ శ్రీనివాస్ తెలిపారు. తొలుత డిసెంబర్ 5, 6 తేదీల్లో నిర్వహించాలని నిర్ణయించగా, స్థానిక సంస్థల ఎన్నికలు, ప్రవాస తెలుగు సంఘాల అభ్యర్థనల నేపథ్యంలో డిసెంబర్ 19, 20 తేదీలకు వాయిదా వేసినట్లు వెల్లడించారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో ఈ మహాసభలు జరగనున్నాయి. తెలుగు భాషా వైభవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటడంతో పాటు బాలబాలికల్లో తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, కళలపై ఆసక్తిని పెంపొందించడమే ఈ మహాసభల ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ మహాసభలకు దేశవిదేశాల నుంచి ప్రముఖులు, సాహితీవేత్తలు, భాషాభిమానులు హాజరుకానున్నారు. 16 ఏళ్లలోపు బాలబాలికలు ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి వేలాదిగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. ఈ వివరాలను మహాసభల సమన్వయకర్తలు డా. కె. మురళీధర్ రెడ్డి, కోగంటి శ్రీకాంత్ వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు సంఘాలు, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, బాలబాలికలు మారిన తేదీలను గమనించి మహాసభలను విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

For a pure tomorrow.. జయహో



## పాడేరు ఘాట్‌లో భవానిల బలోరా బోల్తా

### యువతి మృతి.. 20 మందికి గాయాలు

### ఒకరి పరిస్థితి విషమం

**మాడుగుల అక్టోబర్ 19 జయ జయహే**

శరన్నవరాత్రి వేడుకల్లో విషాదం అలముకుంది. పాడేరు వెళ్లి తిరిగి వస్తున్న భవానిల బొలెరో వ్యాన్ ఘాటి రోడ్డులో కోమలమ్మ పణుకు సమీపంలో బోల్తా పడింది. దీంతో 17 ఏళ్ల యువత మృతిచెందగా, 20 మంది గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. చోడవరం మండలం జుత్తాడ గ్రామానికి చెందిన 20 మంది భవాని భక్తులు సోమవారం మధ్యాహ్నం పాడేరు నుంచి తిరిగి వెళుతుండగా మార్గమధ్యంలో బ్రేకులు విఫలమై ఒక బండరాయికి ఢీకొని బోల్తా పడింది. దీంతో వారందరిని దగ్గర్లో గల మాడుగుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారందరికీ వైద్యులు, డాక్టర్ నరేష్ డాక్టర్ నాయుడు వారి సిబ్బంది అత్యవసర సేవలు అందించారు. వీరిలో తలకు బాగా గాయాలైన ముసిలి నాయుడు తోపాటు మరికొందరిని అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వారిలో 17 ఏళ్ల వేముల పూజిత అనే యువతి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సమాచారశీ అందుకున్న మాడుగుల ఎస్ఐ నారాయణరావు వారి సిబ్బంది ఆస్పత్రికి చేరుకొని వివరాలు సేకరించారు. ప్రమాద సమాచారం అందుకున్న జుత్తాడ గ్రామస్తులు పెద్ద ఎత్తున మాడుల్ ఆసుపత్రికి చేరుకుని తీవ్రంగా రోధిస్తున్నారు. ఆస్పత్రి ఆవరణ విషాదంతో అలముకుంది. గాయపడ్డ వారిలో ఆర్ రాజారావు, ఎం పవిత్ర, ఎం పద్మ, వి ద్వారక, తనుజ, ఎం పావని, కే కావ్య శ్రీ, ఆర్ ప్రసన్న, పరదేశమ్మ, ఎం రేష్మ, ఎం యమునా, ఎం కావ్య శ్రీ, పి ప్రసన్న, కే వంశీ, కే ధరణి, ఆర్ ప్రసాద్, తరుణ్, ఎం జయ, సుందర్ తదితరులు ఉన్నారు.



# మంచితనమే విజయదశమి సందేశం

(సి.హెచ్. ప్రతాప్)

**దసరా అంటే ఆనందాల వేడుక. ఆత్మీయులు కలుసుకునే శు భసమయం. కొత్త ఆశలతో ముందడుగు వేసే మంగళ సందర్భం. ప్రకృతిలో పూలు వికసించినట్లే మనసులో సద్భావనలు వికసించాలని విజయదశమి ఆకాంక్షిస్తుంది. మనలోని శక్తిని గుర్తించి, మంచితనాన్ని పెంచుకుని, జీవితాన్ని అర్థవంతంగా తీర్చిదిద్దుకోవాలనే స్ఫూర్తిని అందిస్తుంది. ధర్మం పట్ల విశ్వాసం, మనిషి పట్ల ప్రేమ, భవిష్యత్తు పట్ల ఆశ ఈ పండుగ సందేశాలు.**



మహిషాసురునిపై దుర్గాదేవి సాధించిన విజయం ధైర్యానికి, ధర్మరక్షణకు ప్రతీక. సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం మనలో ఉందని అమ్మవారి ఆరాధన గుర్తుచేస్తుంది. సంకల్పానికి పట్టుదల తోడైతే కష్టాలను అధిగమించవచ్చనే నమ్మకాన్ని కలిగిస్తుంది. శక్తిస్వరూపిణిని పూజించే సందర్భం ప్రతి స్త్రీలోని ప్రతిభను గౌరవించడానికి, ఆమె ఆశయాలకు అండగా నిలవడానికి ప్రేరణ కావాలి. స్త్రీలు ఆత్మవిశ్వాసంతో ఎదిగే కుటుంబం ఆనందానికి, సమాజం అభ్యున్నతికి నిలయమవుతుంది.

శ్రీరాముని విజయం సత్యనిష్ఠకు, స్నేహానికి, సమష్టి కృషికి స్ఫూర్తి. ఆయన ప్రయాణంలో భిన్నమైన వ్యక్తులు ఒకే లక్ష్యంతో పనిచేశారు. పరస్పర విశ్వాసం అసాధ్యమనుకున్న కార్యాన్నీ సాధ్యం చేస్తుందని ఈ గాథ తెలియజేస్తుంది. కుటుంబంలో సహకారం, సమాజంలో ఐక్యత, పనిలో నిబద్ధత ఉంటే విజయానికి మార్గం సుగమమవుతుంది. ఇతరుల తోడ్పాటును గుర్తించి కృతజ్ఞతతో జీవించడం విజయదశమి నేర్పే విలువ. కలిసి సాధించిన విజయం అందరికీ ఆనందాన్ని పంచుతుంది.

మనసును గెలవడం అంటే మనలోని మంచి లక్షణాలకు బలం చేకూర్చడం. ఓర్పును పెంచుకోవడం, ఎదుటివారి మాటను వినడం, వారి విజయాన్ని అభినందించడం. క్షమించగల విశాలతను, సహాయపడగల ఔదార్యాన్ని అలవరచుకోవడం. ప్రతిరోజూ ఒక మంచి నిర్ణయం తీసుకున్నా జీవనయానం సుందరమవుతుంది. చిన్న మార్పులు పరివర్తనకు దారితీస్తాయి. మన మాటలో ఆత్మీయత, చేతల్లో ఆదరణ పెరిగినప్పుడు మన సాన్నిధ్యమే ఇతరులకు ధైర్యాన్నిస్తుంది. అదే అంతరంగ విజయానికి గుర్తు.

ఆయుధపూజ మన జీవనాధారమైన సాధనాల పట్ల కృతజ్ఞతను వ్యక్తంచేసే సంప్రదాయం. రైతుకు నాగలి, విద్యార్థికి పుస్తకం, కళాకారుడికి వాయిద్యం, కార్మికుడికి పనిముట్టు విలువైనవి. వాటిని పూజించడం ద్వారా శ్రమలోని గౌరవాన్ని గుర్తిస్తాం. వృత్తిని సమర్థంగా, నిజాయతీగా నిర్వర్తించాలనే సంకల్పం చేసుకుంటాం. పనిని ప్రేమతో చేసినప్పుడు అది మన ఎదుగుదలకూ, ఇతరుల శ్రేయస్సుకూ తోడ్పడుతుంది. కర్తవ్యాన్ని సేవగా భావించే దృక్పథమే జీవితానికి సంతృప్తిని అందిస్తుంది.

పండుగ ఆనందాన్ని పంచుకోవడంలో మాధుర్యం ఉంది. పెద్దల ఆశీర్వాదం తీసుకోవడం, బంధుమిత్రులను పలకరించడం, అవసరంలో ఉన్నవారికి సహాయపడటం ఆ ఆనందాన్ని రెట్టింపు చేస్తాయి. పిల్లలకు విజయగాథలతోపాటు సహకారం, కృతజ్ఞత, దయ వంటి విలువలను పరిచయం చేయాలి. వారి ప్రయత్నాలను ప్రోత్సహించాలి. ప్రశ్నలను ఆహ్వానించాలి. ఆత్మవిశ్వాసంతో ఎదిగేందుకు తోడుగా నిలవాలి. ఇటువంటి అనుభవాలే పండుగను వారి జ్ఞాపకాల్లో నిలుపుతాయి. భావితరాలకు సంప్రదాయాల సౌందర్యాన్ని అందిస్తాయి. ఈ విజయదశమిని మంచి సంకల్పంతో ఆహ్వానిద్దాం. కొత్త విద్యను నేర్చుకుందాం. ఆరోగ్యకరమైన అలవాటును ప్రారంభిద్దాం. ఒకరికి ఉపయోగపడే పని చేద్దాం. ఆత్మీయ బంధాలకు సమయం కేటాయిద్దాం. మన ఎదుగుదలతోపాటు చుట్టూ ఉన్నవారి సంతోషాన్నీ కోరుకుందాం. విజయం ప్రశంసల్లోనే కాదు; మన వల్ల వెలిగే చిరునవ్వుల్లోనూ కనిపిస్తుంది. ధైర్యంతో ముందడుగు వేసి, వినయంతో విజయాన్ని స్వీకరించి, కరుణతో జీవించినప్పుడు ప్రతి రోజూ విజయదశమి అవుతుంది.

# వాణిజ్య వీక్షణం: వృద్ధి సంకేతాలు.. మార్కెట్ సవాళ్లు

(ప్రతాప్)






**రూపాయి పుంజుకుంది**

డాలర్‌తో పోలిస్తే రూపాయి సోమవారం ఉదయం ట్రేడింగ్‌లో బలపడి 94.8225 స్థాయికి చేరింది. విదేశీ బ్యాంకుల డాలర్ల విక్రయాలు, ముడిచమురు ధరల తగ్గుదల ఇందుకు దోహదపడ్డాయి. గతవారం రూపాయి సుమారు రెండు శాతం పుంజుకుంది. చమురు శుద్ధి సంస్థలకు ప్రత్యేకంగా డాలర్లు అందించడం వంటి రిజర్వుబ్యాంకు చర్యలు కరెన్సీకి మద్దతిచ్చాయి. అయితే ఈ బలపడటం కొనసాగాలంటే ఆర్థిక మూలాలు మరింత మెరుగుపడాలని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అంతర్జాతీయ చమురు ధరలు ఇంకా అధికంగానే ఉండటం ప్రధాన సవాలుగా నిలుస్తోంది. దిగుమతుల వ్యయం, విదేశీ పెట్టుబడుల ప్రవాహం రూపాయి తదుపరి గమనాన్ని ప్రభావితం చేయనున్నాయి. అందువల్ల తాజా లాభాలను స్థిరమైన కోలుకోవడానికి సంకేతంగా భావించడంలో మార్కెట్ వర్గాలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. ప్రస్తుతానికి అంతర్జాతీయ పరిణామాలపైనే దృష్టి నిలిచింది.

**బ్యాంకింగ్ షేర్లతో సూచీలకు దెబ్బ**

దేశీయ షేర్‌మార్కెట్లు సోమవారం ప్రారంభ ట్రేడింగ్‌లో ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. నిఫ్టీ 0.38 శాతం తగ్గి 23,057.6 వద్ద, సెన్సెక్స్ 0.39 శాతం పడిపోయి 74,434.53 వద్ద నమోదయ్యాయి. ప్రధాన ప్రైవేటు బ్యాంకుల త్రైమాసిక ఫలితాలు అంచనాలను అందుకోకపోవడం సెంటిమెంటును దెబ్బతీసింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు షేర్లు వరుసగా సుమారు రెండు, నాలుగు శాతం క్షీణించాయి. మరోవైపు ప్రభుత్వరంగ బ్యాంకుల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. అధిక ముడిచమురు ధరలు, వడ్డీ ఆదాయ మార్జిన్లపై ఒత్తిడి పెట్టుబడిదారులను కలవరపెడుతున్నాయి. ఇవి ప్రారంభ ట్రేడింగ్ గణాంకాలు మాత్రమే; ముగింపు ధరలు కావు. రానున్న కంపెనీల ఫలితాలు మార్కెట్ దిశకు కీలకంగా మారనున్నాయి. లాభాల వృద్ధి, రుణాల నాణ్యతపై యాజమాన్యాల వ్యాఖ్యలనూ ఇన్వెస్టర్లు నిశితంగా పరిశీలించనున్నారు.

**భారత్‌పై బ్లాక్‌స్టోన్ భారీ ప్రణాళిక**

అంతర్జాతీయ పెట్టుబడి దిగ్గజం బ్లాక్‌స్టోన్ భారత్‌లో తన పెట్టుబడులను వచ్చే ఐదేళ్లలో 100 బిలియన్ డాలర్లకు పెంచాలని యోచిస్తోంది. ప్రస్తుతం ఉన్న పెట్టుబడులను రెట్టింపు చేసే ఈ ప్రణాళిక దేశ దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలపై విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. భారత మూలధన మార్కెట్లలో లావాదేవీల విస్తృతి, కంపెనీలను స్టాక్‌మార్కెట్‌లో ప్రవేశపెట్టే అవకాశాలు సంస్థను ఆకర్షిస్తున్నాయి. స్థిరాస్తి, మౌలిక సదు-పాయాలు, వ్యాపార సంస్థలకు ఇటువంటి మూలధనం ప్రాధాన్యం సంతరించుకుంటుంది. అయితే ఇది ప్రకటిత ప్రణాళిక మాత్రమే; మొత్తం పెట్టుబడి ఇప్పటికే వచ్చేసినట్లు కాదు. అంతర్జాతీయ నిధుల వ్యయం పెరుగుతున్న నేపథ్యంలో విధాన స్థిరత్వం, పారదర్శక నియంత్రణ, ఆర్థిక క్రమశిక్షణ పెట్టుబడుల ప్రవాహాన్ని నిలబెట్టేందుకు కీలకంగా ఉంటాయి. ప్రణాళికల అమలు వేగంపైనే వాస్తవ ప్రయోజనాలు ఆధారపడి ఉంటాయి.

**ఎగుమతుల ఊతంతో చైనా వృద్ధి**

చైనా ఆర్థిక వ్యవస్థ 2026 మూడో త్రైమాసికంలో వార్షిక ప్రాతిపదికన 4.5 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఎగుమతుల బలం, తయారీ రంగం పురోగతి ఈ వృద్ధికి ప్రధానంగా దోహదపడ్డాయి. సెప్టెంబరులో పారిశ్రామిక ఉత్పత్తి 5.5 శాతం పెరిగింది. ఎలక్ట్రానిక్స్, కృత్రిమ మేధ సంబంధిత అధునాతన తయారీ రంగాలు సానుకూల ప్రభావం చూపాయి. అయితే దేశీయ డిమాండ్ బలహీనత, స్థిరాస్తి, మౌలిక సదుపాయాల పెట్టుబడుల తగ్గుదల సవాళ్లుగా కొనసాగుతున్నాయి. దీంతో ఎగుమతుల పురోగతితోపాటు అంతర్గత వినియోగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం కనిపిస్తోంది. తాజా గణాంకాలు చైనా వార్షిక వృద్ధి లక్ష్య సాధనకు మద్దతిస్తున్నప్పటికీ, రంగాల మధ్య అసమాన పురోగతి ఆర్థిక వ్యవస్థలోని పరిమితులను తెలియజేస్తోంది. ప్రపంచ వ్యాపారానికి చైనా గణాంకాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



## పైలట్ల విశ్రాంతే ప్రయాణికుల భద్రత

(ప్రతాప్)

వందల ప్రాణాలను మోసుకెళ్లే విమానానికి సాంకేతిక సామర్థ్యం ఎంత అవసరమో, దానిని నడిపే పైలట్‌కు ప్రశాంతమైన విశ్రాంతి అంతే అవసరం. అలసిన చేతులకు విమానాన్ని అప్పగించి, భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యమని సంస్థలు ప్రకటించడం బాధ్యతారాహిత్యం. ప్రయాణికుల భద్రతకు పునాది ప్రకటనలు కాదు; అప్రమత్తంగా పనిచేయగల సిబ్బంది, అందుకు అనువైన పరిస్థితులు.

విమానాల సంఖ్యను, సర్వీసులను పెంచడమే అభివృద్ధిగా భావించకూడదు. వాటిని నిర్వహించేందుకు సరిపడా పైలట్లను నియమించాలి. సిబ్బంది కొరతను ఉన్నవారిపై అదనపు పనిభారం మోపడం ద్వారా అధిగమించాలనుకోవడం ప్రమాదకరం. నిద్రలేమి, అస్తవ్యస్తమైన విధులు ఏకాగ్రతను దెబ్బతీస్తాయి. క్షణాల్లో కీలక నిర్ణయాలు తీసుకోవాల్సిన వృత్తిలో ఇటువంటి నిర్లక్ష్యానికి తావుండకూడదు. వ్యాపార లక్ష్యాల కోసం మానవ పరిమితులను విస్మరించలేం.

విశ్రాంతి అంటే విధుల మధ్య కాగితంపై చూపించే ఖాళీ సమయం కాదు. ప్రయాణం, భోజనం, వ్యక్తిగత అవసరాలు పూర్తయ్యాక తగినంత నిద్రపోయే అవకాశం ఉండాలి. రాత్రివేళ విధులు, తరచూ మారే షెడ్యూళ్ల ప్రభావాన్ని గుర్తించాలి. నిబంధనల్లోని వెసులుబాట్లను ఉపయోగించుకుని వాటి అసలు ఉద్దేశాన్ని నీరుగార్చకూడదు. పని పట్టికలు సిబ్బంది ఆరోగ్యాన్ని పరిరక్షించేలా ఉండాలి.

పౌర విమానయాన నియంత్రణ సంస్థ నిబంధనల అమలును కఠినంగా పర్యవేక్షించాలి. వాస్తవ పనిగంటలు, విశ్రాంతి అవకాశాలను తనిఖీ చేయాలి. ఉల్లంఘనలకు ప్రభావవంతమైన చర్యలు తీసుకోవాలి. అలసటతో విధులకు సిద్ధంగా లేనని చెప్పే పైలట్‌కు ఉద్యోగ భయం ఉండకూడదు. సమస్యను వెల్లడించినందుకు శిక్షించే సంస్కృతి భద్రతకే ముప్పు. ఫిర్యాదులపై స్వతంత్ర పరిశీలన, ప్రతీకార చర్యల నుంచి రక్షణ అవసరం.

విమాన ఆలస్యాలను తగ్గించడం అవసరమే. అందుకోసం పైలట్ల విశ్రాంతిని బలిచేయడం సమర్థనీయం కాదు. ప్రయాణికులకు సమాచారం, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కల్పించడం సంస్థల బాధ్యత. ప్రమాదం తరువాత పరిహారం ప్రకటించడం కంటే, ముందుగానే సురక్షితమైన పని పరిస్థితులు కల్పించడం ముఖ్యం. విమానయాన ప్రగతిని సర్వీసుల సంఖ్యతోపాటు భద్రతా ప్రమాణాలతో కొలవాలి. ఆకాశంలో ప్రయాణికుడి ప్రాణానికి భరోసా, నేలపై పైలట్‌కు లభించే ప్రశాంతమైన నిద్రతోనే మొదలవుతుంది. ఈ సత్యాన్ని విస్మరించే వ్యాపార విస్తరణను విజయంగా భావించలేం.

# ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన చింతపల్లి ఏఎస్పీ






**కొయ్యూరు: ( జయ జయహే న్యూస్ ) అక్టోబర్ 20,**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు చేపడుతున్న భద్రతా ఏర్పాట్లను పరిశీలించేందుకు చింతపల్లి ఏఎస్పీ నిరంజన్ మహేంద్ర సిన్హ్, కొయ్యూరు మండలాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా కొయ్యూరు మండలంలో స్ట్రాంగ్ రూమ్ మరియు బ్యాలెట్ బాక్సుల భద్రతకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. బ్యాలెట్ బాక్సులను భద్రపరిచే ప్రదేశంలో భద్రతా చర్యలు, ఎన్నికల సామగ్రి పరిరక్షణ, ఇతర అవసరమైన ఏర్పాట్ల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం రిటర్నింగ్ ఆఫీసర్ తో సమావేశమై, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలు, అధికారుల సమన్వయం, ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై చర్చించారు.అనంతరం కాకరపాడు జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్‌ను ఏఎస్పీ తనిఖీ చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందితో మాట్లాడి, వాహన తనిఖీల నిర్వహణ, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా, అక్రమ రవాణా నివారణకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు.ఎన్నికల సమయంలో అక్రమ నగదు, మద్యం, ఇతర నిషేధిత వస్తువుల రవాణాను అరికట్టేందుకు వాహన తనిఖీలను నిరంతరం, సమర్థవంతంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా శాంతియుత వాతావరణాన్ని కల్పించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఏఎస్పీ సూచించారు.



### బూడి అమ్మన్నమ్మకు
## ధర్మాన సోదరుల నివాళి

**దేవరాపల్లి, అక్టోబర్ 19, జయ జయహే :**

మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బూడి ముత్యాలనాయుడు తల్లి బూడి అమ్మన్నమ్మ ఇటీవల పరమపదించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మాడుగుల నియోజకవర్గం, దేవరాపల్లి మండలం, తారువ గ్రామంలోని వారి నివాసానికి పలువురు ప్రముఖులు విచ్చేసి అమ్మన్నమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ప్రముఖ నేతలు మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఆముదాలవలస సమన్వయకర్త చింతాడ రవి కుమార్, నేతలు మామిడి శ్రీకాంత్, అంబటి శ్రీను, తదితరులు తారువ గ్రామానికి చేరుకుని అమ్మన్నమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం మాజీ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ గాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి దేవుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని, అమ్మన్నమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### శ్రీశ్రీ మహిషాసుర మర్దినిగా
## భక్తులకు దర్శనమిచ్చిన శ్రీశ్రీశ్రీనల్ల గంగమ్మ తల్లి

**శ్రీకాళహస్తి అక్టోబర్ 19 జయ జయహే,**



బహదూర్ పేట తెట్టు వద్ద వెలసిన శ్రీ శ్రీ నల్ల గంగమ్మ తల్లి, సోమవారం శ్రీ శ్రీమహిషాసుర మర్దినిగా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ కంట రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు అలంకరణను చేశారు. అమ్మవారిని తిలకించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ బోర్డు సభ్యులు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు ఆలయ సిబ్బంది తీర్థప్రసాదాలు అందజేశారు.




### శ్రీకాళహస్తి ఆలయంలో
## ఘనంగా ఆయుధపూజ

**మహార్నవమి సందర్భంగా స్వామివారు, అమ్మవారి దివ్యాయుధాలకు ప్రత్యేక పూజలు**

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 19, జయ జయహే**

శ్రీకాళహస్తి ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామివారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహార్నవమి ఆయుధపూజ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేదపండితులు, అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ స్వామివారు, అమ్మవారి దివ్యాయుధాలకు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ గర్భాలయంలో స్వామివారు, అమ్మవారి మూలమూర్తుల వద్ద ఉంచే త్రిశూలం, ఖడ్గం, అంకుశం, పాశం తదితర దివ్యాయుధాలకు అర్చకులు పూజలు చేశారు. అలాగే ఆలయ రథాలు, పల్లకీలు, వివిధ ఉత్సవ వాహనాలతో పాటు దేవస్థానంలోని వివిధ విభాగాలకు చెందిన పరికరాలు, అధికారిక వాహనాలకు సైతం ఆయుధపూజ నిర్వహించారు.వేదమంత్రాల పఠనం, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. అమ్మవారి అనుగ్రహం పొందడంతో పాటు సర్వజన సౌభాగ్యం, లోకకల్యాణం, విఘ్నాల నివారణ కలగాలని అర్చకులు ప్రార్థనలు చేశారు.ఈ పూజా కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### శ్రీ అర్ధనారీశ్వర స్వామి ఆలయంలో
## వైభవంగా అభిషేకాలు

**500 మందికి పైగా భక్తులకు అన్నదానం**

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 19, జయ జయహే**

శ్రీకాళహస్తి పట్టణంలోని బైపాస్ రోడ్డులో వెలసిన శ్రీ అర్ధనారీశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి మణికంఠ స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. పూజా కార్యక్రమాల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 500 మందికి పైగా భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ సునీతతో పాటు భక్తులు గోవిందు, మురళి, శివప్రకాష్, రాజారెడ్డి, వెంకటమ్మ, రమేష్, వెంకట చలపతి తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల ఏర్పాట్లు ప్రక్రియలో జాగ్రత్త

**ఎన్నికల పరిశీలకులు ఎ.భార్గవ్ తేజ్**

**ఎన్నికల వ్యయ పరిశీలకులు పి. వి .సందీప్ రెడ్డి**

**విశాఖపట్నం, అక్టోబర్ 19, జయ జయహే :**

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ రెండవ సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల ఏర్పాట్లు నామినేషన్ల ప్రక్రియలో ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా జాగ్రత్తలు పాటించాలని ఎన్నికల పరిశీలకులు ఎ.భార్గవ్ తేజ్ , ఎన్నికల వ్యయ పరిశీలకులు పి. వి.సందీప్ రెడ్డి రిటర్నింగ్ అధికారులకు, సహాయక ఎన్నికల అధికారులకు ఆదేశించారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి గదిలో నామినేషన్ పత్రాలు పరిశీలన ప్రక్రియతో పాటు సౌత్ జోన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల విభాగాలను, స్ట్రాంగ్ రూములను సౌత్ జోన్ జోనల్ కమిషనర్, సహాయక ఎన్నికల అధికారి ఎమ్.మల్లయ్య నాయుడు తో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా వారు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాల పరిశీలన ప్రక్రియ తోపాటు, సౌత్ జోన్ లోని వార్డుల వారీగా అభ్యర్థులు వేసిన నామినేషన్ పత్రాల పరిశీలన ప్రక్రియ ను పరిశీలించి, నిబంధనల ప్రకారం సక్రమంగా ఉన్నాయా లేదా అనే అంశాలను పరిశీలించారు. అలాగే బ్యాలెట్ బాక్సులు, స్ట్రాంగ్ రూమ్, ఎన్నికల సామగ్రి, తదితర ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం సౌత్ జోన్ లోని వార్డు నెంబర్ 39 లో జీవీఎంసీ రమాదేవి భానోజీ రావు ప్రైమరీ స్కూల్ లో ఏర్పాటుచేసిన పోలింగ్ స్టేషన్ లు 6 ,7, 12, 13 ,14, పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి, అక్కడ చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని , నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని వారు సూచించారు.

# జడ్పీ ఎన్నికలకు సర్వం సిద్ధం

**అక్టోబర్ 21 నుంచి నామినేషన్ల స్వీకరణ**

**53 ఎంపీటీసీ, 04 జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ**

**జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్**

**విశాఖపట్నం, అక్టోబర్ 19, జయ జయహే**



విశాఖపట్నం జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిశోర్ వెల్లడించారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 21 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు వివరించారు. ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ప్రకారం జిల్లాలోని నాలుగు జడ్పీటీసీ, 53 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అక్టోబర్ 19న వెలువడిన ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం 21న నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుందని తెలిపారు. అక్టోబర్ 23 నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ అని, 24న పరిశీలన ఉంటుందని చెప్పారు. నవంబర్ 3న పోలింగ్, 5న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ఉంటుందని వివరించారు. నవంబర్ 7న పరోక్ష ఎన్నికల నోటీసు, 11న పరోక్ష ఎన్నికల ప్రత్యేక సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. పరిషత్ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా జాయింట్ కలెక్టర్ వ్యవహరిస్తారని, జడ్పీ సీఈవో అదనపు ఎన్నికల అథారిటీగా ఉంటారని తెలిపారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం 16 జోన్లను ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 203 పోలింగ్ కేంద్రాలను సుమారు 106 ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికల విధుల నిర్వహణకు 1,462 మంది సిబ్బందిని నియమించామని, పోలింగ్ సామగ్రి తరలింపు కోసం 25 రూట్లను గుర్తించామని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును పర్యవేక్షించేందుకు నాలుగు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలు, నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్లు, నాలుగు స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, రెండు వీడియో వీక్షణ బృందాలు, ఐదు ఎన్నికల వ్యయ పరిశీలన బృందాలు, ఐదు సింగిల్ విండో క్లియరెన్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎన్నికల వ్యయ పరిమితి ఎంపీటీసీ అభ్యర్థులకు రూ.4 లక్షలు, జెడ్పీటీసీ అభ్యర్థులకు రూ.8 లక్షలుగా నిర్ణయించినట్లు పేర్కొంటూ అభ్యర్థులు ఎన్నికల సంఘం నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

**నామినేషన్లు ఎక్కడ స్వీకరిస్తారు**

పరిషత్ ఎన్నికల్లో భాగంగా జడ్పీటీసీ అభ్యర్థులు జడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్వో ఛాంబర్లో, ఎంపీటీసీ అభ్యర్థులు ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లోని ఆర్వో ఛాంబర్లలో నామినేషన్లు సమర్పించాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఇప్పటికే ఆయా ఆర్వోలను నియమించినట్లు పేర్కొన్నారు. పారదర్శక ఎన్నికల ప్రక్రియకు, అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

For a pure tomorrow.. జయహో

# వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన నలుగురి అరెస్ట్

## రూ.57 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, మూడు బైకులు స్వాధీనం

**తిరుపతి, అక్టోబర్ 19, జయ జయహే**




తిరుపతి జిల్లా పరిధిలో ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుచానూరు పరిధిలో 8, రామచంద్రాపురం పరిధిలో 4, వడమాలపేట పరిధిలో ఒకటి చొప్పున మొత్తం 13 కేసులను ఛేదించారు. నిందితుల నుంచి సుమారు రూ.57 లక్షల విలువైన 352 గ్రాముల బంగారు ఆభరణాలు, నేరాలకు ఉపయోగించిన మూడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టి తిరుచానూరు పరిధిలోని దామినీడు వద్ద ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నాయి. వారి విచారణలో చోరీ చేసిన బంగారు ఆభరణాలను రేణిగుంటలో దాచినట్లు గుర్తించి, మరో నిందితుడిని కూడా అరెస్ట్ చేశారు. బైకుల నంబర్ ప్లేట్లను పదేపదే మారుస్తూ ఒంటరిగా వెళ్లే మహిళల మెడలోని బంగారు గొలుసులను దొంగిలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.కేసులను సమ–ర్థవంతంగా ఛేదించిన చంద్రగిరి డీఎస్పీ జగదీష్ నాయక్, తిరుచానూరు ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు. మహిళలు ఆభరణాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు వెంటపడుతున్నట్లు గుర్తిస్తే వెంటనే 112కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారి దేవస్థానం ఈఓగా కే. లలిత బాధ్యతల స్వీకరణ



**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారి దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారిణిగా, కే. లలిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కే. లలిత గత రెండేళ్లుగా మచిలీపట్నంలోని ఆంధ్ర జాతీయ విద్యా పరిషత్‌లో అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వహణాధికారిణిగా విధులు నిర్వహించారు. అక్కడి నుంచి బదిలీపై తిమ్మరాజుపాలెంలోని శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారి దేవస్థానానికి వచ్చి నేడు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఈ దేవస్థానంలో అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వహణాధికారిగా పనిచేసిన వి. హరి సూర్య ప్రకాష్ భీమవరంలోని శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానానికి బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా దేవస్థానం ఫౌండర్ ఫ్యామిలీ సభ్యులు దేవులపల్లి రవి శంకర్, ఆలయ సిబ్బంది నూతన కార్యనిర్వహణాధికారిణి కే. లలితకు శుభాకాంక్షలు తెలిపారు.



# గెలుపే లక్ష్యంగా కూటమి నేతల ఎన్నికల సన్నాహక భేటీ

## స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహాలపై చర్చ.. హాజరైన తుడా ఛైర్మన్ డా. డాలర్స్ దివాకర్ రెడ్డి

**తిరుపతి, అక్టోబర్ 19, జయ జయహే**

తిరుపతి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా తిరుపతిలో కూటమి నాయకులు ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన ఈ సమావేశంలో ఎన్నికల నిర్వహణ, ప్రచార వ్యూహాలు, క్షేత్రస్థాయిలో సమన్వయంపై విస్తృతంగా చర్చించారు.ఈ సమావేశానికి తుడా ఛైర్మన్, టీటీడీ ఎక్స్‌అఫీషియో సభ్యుడు, టీడీపీ తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా. డాలర్స్ దివాకర్ రెడ్డి హాజరై నాయకులకు దిశానిర్దేశం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు కూటమికి అందించిన విజయాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కొనసాగించాలని, తిరుపతి నగర అభివృద్ధికి కూటమి అభ్యర్థుల గెలుపు కీలకమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, స్థానిక ఎన్నికల పరిశీలకుడు నుకసాని బాలాజీ, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, తిరుపతి మేయర్ అభ్యర్థి జేబీ శ్రీనివాస్, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.



# వైసీపీ కార్యకర్తలు సైనికుల పనిచేయాలి

## ఎంపీపీ అభ్యర్థి బూరె బాబురావు

**దేవరాపల్లి, అక్టోబర్ 19, జయ జయహే :**

మండలంలోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో విజయ ఢంకా మోగించేలా ప్రతీ ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని వైఎస్సార్సీపీ దేవరాపల్లి మండల అధ్యక్షుడు, ఎంపీపీ అభ్యర్థి బూరె బాబురావు సూచించారు. మండలంలోని మామిడిపల్లిలో మాజీ జెడ్పీటీసీ కర్రి సత్యంతో కలిసి సోమవారం పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో అనుసరించాల్సిన.. వ్యూహం, అభ్యర్థుల ఎంపికపై చర్చించారు. వైఎస్సార్సీపీ, మాజీ డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు బలపరిచిన జెడ్పీటీసీతో పాటు ఎంపీటీసీ అభ్యర్థులను గెలుపుకు ప్రతీ ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అందించిన సంక్షేమం, అభివృద్ధి తమ అభ్యర్థుల విజయానికి సోపానాలుగా నిలుస్తాయన్నారు. జగనన్న పాలనలో జరిగిన మంచిని ప్రతీ ఇంటికి వెళ్లి వివరించడంతో పాటు కూటమి మోసాలను సైతం ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పంచాద సింహాచలంనాయుడు, మాజీ సర్పంచ్, వైఎస్సార్సీపీ మండల యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, గ్రామ శాఖ అధ్యక్షుడు చల్లా మహేష్, నాళం శ్రీనివాసరావు, పోతల సత్యన్నారాయణ, జూరెడ్డి గోవింద, చల్లా సుధాకర్రావు, పల్లి వెంకట ప్రసాద్, నౌడు గణేష్, పోతల జగన్నాధం తదితర నాయుకులు పాల్గొన్నారు.

# తుమ్మపాలలో భక్తిశ్రద్ధలతో దీపారాధన

## కనకదుర్గమ్మ ఆలయంలో ఘనంగా పూజా కార్యక్రమాలు

**అనకాపల్లి, అక్టోబర్ 19, జయ జయహే**



అనకాపల్లి జిల్లా అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ సతీమణి పావని ఆధ్వర్యంలో తుమ్మపాల వాటర్ వర్క్స్ వద్ద ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రులను పురస్కరించుకుని ఘనంగా దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు మళ్ళ మురళి సూచనలు, సలహాల మేరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తిశ్రద్ధలతో 3 వేల దీపాలను వెలిగించి దీపారాధన చేశారు.అమ్మవారి సన్నిధిలో వేలాది దీపాలు వెలుగులు విరజిమ్మడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులు దీపాలను వెలిగించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దసరా నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన ఈ దీపారాధన కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, అధిక సంఖ్యలో భక్తులు, స్థానికులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.





# శ్రీ మహిషాసుర మర్దినిగా అమ్మవారి దివ్యదర్శనం

## శ్రీ సత్యసాయి మందిరంలో వైభవంగా దసరా

**విశాఖపట్నం, అక్టోబర్ 19, జయ జయహే :**

ఎంవీపీ కాలనీలోని శ్రీ సత్యసాయి ప్రేమ సదన్ మందిరంలో దసరా పాంచరాత్ర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా అమ్మవారిని శ్రీ మహిషాసుర మర్దినిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో మహిషాసుర మర్దిని సహస్రనామార్చన, అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిరుపేద మహిళలకు చీరలు, నెలకు సరిపడా నిత్యావసర సరుకులతో కూడిన శ్రీ సత్యసాయి అమృత కలశాలను పంపిణీ చేశారు. అనంతరం బాలల పూజ, సువాసిని పూజ నిర్వహించి చిన్నారులకు, మహిళలకు దుర్గామాత స్వరూపంగా భావించి పూజలు చేశారు. నీరాజన మంత్రాలు, పుష్ప సమర్పణ అనంతరం మంగళహారతితో ఉదయం పూజా కార్యక్రమాలు ముగిశాయి. ఈ పూజా కార్యక్రమాలను విశాఖ జిల్లా మహిళా ఆధ్యాత్మిక సమన్వయకర్త రాధా సత్యవరపు, పండితులు భాస్కర శర్మ, వేదం ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థల విశాఖ జిల్లా అధ్యక్షుడు పి.ఆర్.ఎస్.ఎన్. నాయుడు, బాలా త్రిపుర సుందరి, సిటీ సేవా సమితి కన్వీనర్ బి. సాయికుమార్, ఇతర పదాధికారులు, అధిక సంఖ్యలో మహిళా భక్తులు, భక్తులు పాల్గొన్నారు.



# గ్రామదేవతల పూజల అనంతరం నామినేషన్ పత్రాల సమర్పణ

**విశాఖపట్నం, అక్టోబర్ 19, జయ జయహే**

జీవీఎంసీ ఎన్నికల్లో 120వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థిగా పాశర్ల వరహా వెంకట ప్రసాద్ తన నామినేషన్ పత్రాలను మధురవాడ జోనల్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావుకు సమర్పించారు. అయితే నామినేషన్ పత్రాలను సమర్పించే ముందు శ్రీశ్రీశ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి సహోదరిగా భావించే శ్రీ పైడిమాంబ, బంగారమ్మ, ముత్యాలమ్మ, మరిడమ్మ తదితర గ్రామదేవతలను ఆరాధించే లండ వంశీయులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం నామినేషన్ పత్రాలను పాశర్ల వరహా వెంకట ప్రసాద్ కుటుంబ సభ్యులకు అందజేశారు. గ్రామదేవతల ఆశీస్సులతో ఎన్నికల ప్రక్రియను ప్రారంభించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు




# మండల పరిషత్ కార్యాలయానికి చేరిన బ్యాలెట్ బాక్సులు

## పోలీస్ పహారా మధ్య భద్రత

**ముంచంగిపుట్టు, జయ జయహే:**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ముంచంగిపుట్టు మండలంలో అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి మండల పరిషత్ కార్యాలయానికి 114 బ్యాలెట్ బాక్సులు చేరుకున్నాయి. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ కోసం వీటిని తీసుకువచ్చారు. అనంతరం బ్యాలెట్ బాక్సులను మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో భద్రపరిచారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయడంతో పాటు పోలీస్ పహారా నిర్వహిస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు.



### పచ్చి కొబ్బరిని వాడితే.. బ్యూటీ పార్లర్‌కు వెళ్లాల్సిన

## అవసరమే ఉండదు

కొబ్బరితో ఎన్నో రకాల రుచికరమైన వంటలను తయారుచేసుకోవచ్చు. ఎక్కువగా ఇది దక్షిణ భారతదేశంలో వాడుతుంటారు. ప్రతీ వంటకాల్లోను కొబ్బరిని ఉపయోగిస్తుంటారు. అందువల్ల అక్కడ ప్రతీ ఒక్కరు అందంగాను, యవ్వనంగాను కనిపిస్తుంటారు. అయితే కొబ్బరిని సాధారణంగా అయితే కొబ్బరి చట్నీ, సాంబార్, కొబ్బరి అన్నం, కొబ్బరి స్వీట్ వంటి రకరకాల పదార్థాలను తయారుచేసుకుని ఆస్వాదిస్తుంటారు అని మాత్రమే తెలుసు. అంతేకాదు కొబ్బరిని పొడిగా చేసుకుని ప్రతీ వంటల్లోను ఉపయోగిస్తే ఎంతో రుచికరమైన ఆహారాన్ని తినవచ్చు.
అయితే పచ్చి కొబ్బరితో ఆరోగ్యానికి పుష్కలమైన ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్యంతో పాటు చర్మ సౌందర్యాన్ని కూడా కాపాడుకోవచ్చని కూడా అంటున్నారు. కొబ్బరిలో ఫైబర్, విటమిన్ సి, ఈ, బి, ఐరన్, కాల్షియం, ఫాస్పరస్, మినరల్స్ వంటివి పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి మాత్రమే కాదు చర్మ సౌందర్యాన్ని కూడా రక్షిస్తాయి.
పచ్చి కొబ్బరి జీవక్రియను కూడా మెరుగుపరుస్తుంది. ఇది మలబద్ధకం వంటి సమస్యలను కూడా దూరం చేస్తుంది. కొబ్బరిలో ఉండే విటమిన్లు, మినరల్స్ జుట్టును ఆరోగ్యంగా ఉంచడంతో పాటు చర్మాన్ని కూడా యవ్వనంగా కనిపించేలా చేస్తాయి. ముఖ్యంగా వయసు మీద పడుతున్న వారికి ఇది ఓ అద్భుతమైన ఔషధంలా పనిచేస్తుంది. చర్మంపై ముడతలు, మచ్చలు వంటి వాటిని తొలగించేందుకు తోడ్పడుతుంది. కొబ్బరిలో పుష్కలమైన విటమిన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఖనిజాలు వంటి ఉండడం వల్ల ఇవి బరువును తగ్గించుకోవడానికి కూడా సహాయడపతాయి. అందువల్ల తరచూ కొబ్బరిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఆకలిని తగ్గించి బరువు నియంత్రిస్తుంది. అధిక కేలరీలు తీసుకోవడం వంటి వాటిని కూడా నిరోధిస్తుంది.
కొబ్బరి కేవలం చర్మ సౌందర్యానికి మాత్రమే కాకుండా అనారోగ్య సమస్యలకు కూడా ఎంతగానో సహాయపడుతుంది. అందులో ముఖ్యంగా ప్రస్తుతం ఎదుర్కుంటున్న గుండె సమస్యలకు అద్భుతంగా పనిచేస్తుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సహాయపడుతుంది. మంచి కొలస్ట్రాల్ పెంచి, చెడు కొలస్ట్రాల్ ను తగ్గిస్తుంది. పచ్చి కొబ్బరిలో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి ఉండడం వల్ల రోగనిరోధక వ్యవస్థలను బలపరుస్తుంది. అంతేకాదు ఇందులో ఉండే కాల్షియం, పొటాషియం ఎముకలను బలోపేతం చేసేందుకు సహాయపడతాయి.

# పచ్చిపాలతో మీ అందం రెట్టింపు

## ఈ నేచురల్ మిల్క్ ఫేస్ ప్యాక్స్ ట్రై చేయండి



పాలు ఆరోగ్యానికి ఎంత మంచిదో మనందరికి తెలుసు.. కానీ పాలతో చర్మ సౌందర్యాన్ని పెంచుకోవచ్చని మీకు తెలుసా?
అవును పాలతో కలిపి ఈ ఫేస్ ప్యాక్‌లు ట్రై చేశారంటే అందం రెట్టింపు అవుతుంది. పాలలోని సహజ గుణాలు ముఖంపై మురికిని, మృతుకణాలను తొలగిస్తుంది. పాలు చర్మాన్ని హైడ్రేట్ చేసి తేమగా ఉండేలా చేస్తుంది. పాలలో అనేక రకాల విటమిన్లు, పోషకాలు, లాక్టిక్ యాసిడ్ వంచి గుణాలు పుష్కలంగా లభిస్తాయి. ఇవి చర్మాన్నిపునరుజ్జీవింప చేస్తాయి. మీరు పాటించే స్కిన్ కేర్ రొటీన్‌లో పాలను కూడా ఉపయోగిస్తే మంచి ఫలితం ఉంటుందని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. పచ్చి పాలను ముఖానికి వాడినట్లైతే చర్మం కాంతివంతంగా మెరుస్తుంది. ఇంకెందుకు ఆలస్యం మీరు కూడా పచ్చిపాలతో ఈ పదార్థాలను కలిపి ఫేస్ ప్యాక్ ట్రై చేశారంటే మీ చర్మం మిల మిల మెరిసిపోవడం ఖాయం.

**పచ్చి పాలు, బాదం పప్పు ఫేస్ ప్యాక్**
ముందుగా బాదం పప్పును రాత్రంతా నానబెట్టండి. ఆ తర్వాత పచ్చి పాలలో బాదం పప్పులు వేసి మెత్తగా పేస్ట్ చేయండి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు అప్లై చేయండి. 10 నిమిషాల తర్వాత ముఖాన్ని సాధారణ నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే ముఖం కాంతివంతంగా మారుతుంది. ఇలా చేయడం వల్ల ముఖంపై మచ్చలు, మొటమలు తగ్గిపోతాయి. చర్మాన్ని తేమగా ఉంచడంలో సహాయపడతాయి.

**పచ్చి పాలు, తేనె ఫేస్ ప్యాక్**
పచ్చి పాలల్లో తేనె కలిపి ముఖానికి అప్లై చేయండి. 10-15 నిమిషాల తర్వాత చల్లటి నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా ప్రతిరోజు చేస్తే చర్మం బిగుతుగా



మారుతుంది. మృతుకణాలు తొలగిపోతాయి. ముఖంపై మచ్చలు, ముడతలు తగ్గిపోయి కాంతివంతంగా మెరుస్తుంది.

**పచ్చిపాలు, పసుపు ఫేస్ ప్యాక్**
పచ్చి పాలల్లో చిటెకెడు పసుపు వేసి ముఖానికి అప్లై చేయండి. 5-10 నిమిషాల తర్వాత సాధారణ నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోండి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే మీ ముఖం కాంతివంతంగా మెరుస్తుంది. పసుపులో ఉండే యాంటీ బయాటిక్స్ చర్మం ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది.

**పాలు, అవకాడో ఫేస్ ప్యాక్**
మూడు టేబుల్ స్పూన్ పాలల్లో అవకాడో గుజ్జును కలిపి మెత్తగా పేస్ట్ చేయాలి. ఆ మిశ్రమాన్నిముఖానికి, మెడకు అప్లై చేయాలి. అరగంట తర్వాత సాధారణ నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

**పాలు, బొప్పాయి ఫేస్ ప్యాక్**
బొప్పాయి గుజ్జులో రెండు చేబుల్ స్పూన్ పాలు, టీ స్పూన్ తేనె కలిపి రాత్రి పడుకునే ముందు ముఖానికి అప్లై చేయండి. ఆ తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకుంటే ముఖం కాంతివంతంగా మెరుస్తుంది.

# చికెన్ వింగ్స్.. ఇంట్లోనే సులువుగా చేసుకోవచ్చు



**చికెన్ వింగ్స్ పేరు చెబితేనే నోరూరిపోతుంది. దాన్ని తినాలంటే ప్రతిసారి రెస్టారెంట్ కి వెళ్లాల్సిన అవసరం లేదు. ఇంట్లోనే చాలా సులువుగా చేసుకోవచ్చు. కాస్త ఓపిక ఉంటే చాలు చికెన్ వింగ్స్ గంటలో రెడీ అయిపోతాయి. ఇవి ఇంట్లో ఉన్న పిల్లలకు, పెద్దలకు కూడా ఇది బాగా నచ్చుతాయి. ఎలా చేయాలో తెలుసుకోండి.**

**చికెన్ వింగ్స్ రెసిపీకే కావలసిన పదార్థాలు**

చికెన్ వింగ్స్ - అరకిలో
మైదాపిండి - అరకప్పు
కారం - ఒక స్పూను
మిరియాల పొడి - అర స్పూను
ఉల్లిపాయ పొడి - ఒక స్పూను
వెల్లుల్లి పొడి - ఒక స్పూను
నూనె - వేయించడానికి సరిపడా
ఉప్పు - రుచికి సరిపడా
బటర్ - రెండు స్పూన్లు
సోయాసాస్ - ఒక స్పూన్
బ్రౌన్ షుగర్ - మూడు స్పూన్లు
వెల్లుల్లి తురుము - ఒక స్పూను
అల్లం తురుము - ఒక స్పూను
తేనె - ఒక స్పూన్
పచ్చిమిర్చి - రెండు
ఎండుమిర్చి - రెండు
నువ్వులు - ఒక స్పూను
సోయాసాస్ - రెండు స్పూన్లు

**చికెన్ వింగ్స్ రెసిపీ**

చికెన్ వింగ్స్ ను తెచ్చి శుభ్రంగా కడిగి తడి లేకుండా టిష్యూ పేపర్ మీద ఆరబెట్టాలి.

ఒక గిన్నెలో మైదా, కారం, ఉప్పు, పచ్చిమిర్చి తరుగు, వెల్లుల్లి తరుగు, ఉల్లిపాయల పొడి వేసి బాగా కలిపి చికెన్ వింగ్స్ ను కూడా వేయాలి.

ఆ మిశ్రమం చికెన్ వింగ్స్‌కు బాగా పట్టేలా ఒక అరగంట పాటు పక్కన పెట్టేయాలి.

ఇప్పుడు స్టవ్ మీద కళాయి పెట్టి నూనె వేయాలి.

చికెన్ వింగ్స్ అందులో వేసి వేయించి తీసి టిష్యూ పేపర్ మీద వేసుకోవాలి.

ఇప్పుడు ఒక కళాయిని స్టవ్ మీద పెట్టి చిన్న మంట పెట్టాలి. 7. దానిలో బటర్ వేయాలి. ఆ బటర్ లో అల్లం వెల్లుల్లి తురుమును వేయాలి.

అలాగే సోయాసాస్, తేనే, బ్రౌన్ షుగర్ కూడా వేసి కలుపుకోవాలి.

సాస్ కొద్దిగా చిక్కగా అయ్యాక పెద్ద మంట పెట్టి ముందుగా వేయించి తీసుకున్న చికెన్ వింగ్స్ ను వేసి టాస్ చేసుకోవాలి.

చివర్లో ఎండుమిర్చి ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు వేసి కలుపుకోవాలి.

నువ్వులు గింజలను చల్లుకోవాలి. అంతే టేస్టీ చికెన్ వింగ్స్ రెడీ అయినట్టే. ఇది నోరూరించేలా ఉంటాయి.

ఇంట్లో పిల్లలకు పెద్దలకు అందరికీ నచ్చుతాయి

చికెన్ వింగ్స్ బయట ఎక్కువ రేటు ఉండే అవకాశం ఉంది. అదే ఇంట్లో చేసుకుంటే చాలా తక్కువ ధరకే ఇవి రెడీ అయిపోతాయి. ముందుగానే చికెన్ షాప్ వాడికి వింగ్స్ ను వేరుగా చేసి పెట్టమని ఆర్డర్ ఇచ్చుకోవాలి. లేదా ఆన్లైన్ చికెన్ మార్కెట్లలో కూడా చికెన్ వింగ్స్ సపరేట్ గా దొరుకుతున్నాయి. వాటిని కొనుక్కున్నా సరిపోతుంది. టేస్టీ చికెన్ వింగ్స్ వండేసుకోవచ్చు.

For a pure tomorrow.. జయహే

# మాతృత్వానికే మాయని మచ్చ




**-పసిబిడ్డ ఒంటిపై గాయాలు**

**-గుంటూరులో కలచివేసిన విషాదం**

**(ప్రతాప్)**

గుంటూరు నగరంలో మూడేళ్ల చిన్నారి అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఒంటిపై తీవ్ర గాయాలు, కొరికినట్లు కనిపిస్తున్న గుర్తులతో చిన్నారిని గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రికి తీసుకురాగా, అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు నిర్ధారించారు. గాయాల స్వభావంపై అనుమానం వ్యక్తం చేసిన వైద్యులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన వెలుగులోకి వచ్చింది.

పోలీసులు, వార్తా కథనాల్లో వెల్లడైన వివరాల ప్రకారం, మృతురాలు ఇషిక తన తల్లి నాగలక్ష్మి వద్ద నివసిస్తోంది. భర్తతో విభేదాల కారణంగా నాగలక్ష్మి వేరుగా ఉంటూ స-ుభాష్ అనే వ్యక్తితో కలిసి జీవిస్తున్నట్లు సమాచారం. శనివారం చిన్నారిని తీవ్ర గాయాలతో ఆసుపత్రికి తీసుకొచ్చిన నాగలక్ష్మి, ఇంట్లో మెట్లపై నుంచి పడిపోవడంతో గాయాలయ్యాయని వైద్యులకు తెలిపినట్లు కథనాలు పేర్కొన్నాయి.




అయితే చిన్నారి శరీరంపై అనేక గాయాలతోపాటు కొరికినట్లు కనిపించే గుర్తులు ఉండటంతో వైద్యులకు అనుమానం కలిగింది. పోస్టుమార్టం నిర్వహించాలని వైద్యులు సూచించగా నాగలక్ష్మి, సుభాష్ అభ్యంతరం తెలిపినట్లు సమాచారం. దీంతో ఆసుపత్రి ఔట్‌పోస్ట్ పోలీసులకు విషయం తెలియజేశారు. అనంతరం కొత్తపేట, అరండల్‌పేట పోలీసులు ఆసుపత్రికి చేరుకుని వివరాలు సేకరించారు. చిన్నారి మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

చిన్నారి కొంతకాలంగా హింసకు గురైందని, సహజీవనానికి అడ్డుగా ఉందనే కారణంతో వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు వెలువడ్డాయి. అయితే ఈ ఆరోపణలను పోలీసులు అధికారికంగా నిర్ధారించాల్సి ఉంది. చిన్నారి శరీరంపై కనిపించిన గాయాలు ఎలా అయ్యాయి? మరణానికి అసలు కారణమేమిటి? గాయాలకు బాధ్యులెవరు? అనే ప్రశ్నలకు పోస్టుమార్టం నివేదిక, సమగ్ర దర్యాప్తు అనంతరమే స్పష్టత రానుంది. ఈ ఘటనకు సంబంధించి నాగలక్ష్మి, సుభాష్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. చిన్నారి మెట్లపై నుంచి పడిపోయిందన్న వాదనలో నిజమెంత అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. వైద్యుల అప్రమత్తతతో ఘటన పోలీసుల దృష్టికి చేరగా, పసిబిడ్డ మరణానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బిడ్డకు ప్రపంచంలో అత్యంత సురక్షితమైన ప్రదేశం తల్లిదండ్రుల ఒడే, సొంత ఇల్లే. కానీ ఆ ఇంట్లోనే కన్నబిడ్డ భయంతో బతకాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయంటే అది మన సమాజంలో క్షీణిస్తున్న మానవత్వానికి అత్యంత బాధాకరమైన సంకేతం. ప్రేమతో లాలించాల్సిన చేతులే పసిప్రాణాలకు భయాన్ని కలిగిస్తే, మనం సాధించిన నాగరికతకు అర్థమేమిటనే ప్రశ్న తలెత్తుతుంది. కుటుంబ బంధాల కంటే వ్యక్తిగత స్వార్థాలు, ఆవేశాలు పైచేయి సాధించినప్పుడు చివరకు బలయ్యేది ఏ తప్పూ తెలియని చిన్నారులే. పిల్లల రక్షణ కేవలం కుటుంబ బాధ్యత మాత్రమే కాదు, సమాజం మొత్తం మోసే నైతిక బాధ్యత కూడా.

# అమెరికాలోని ప్రతి బిడ్డకూ స్పేస్‌ఎక్స్ షేర్స్

**జయ జయహే**

అమెరికా బిలియనీర్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అమెరికాలోని ప్రతి బిడ్డకూ తన స్పేస్‌ఎక్స్ సంస్థకు చెందిన ఒక షేరును ఉచితంగా ఇస్తానని ప్రకటించారు. వచ్చే ఏడాది నుంచి ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. ఇది తాను ఇవ్వబోయే అనేక బహుమతులలో మొదటిది మాత్రమేనని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. కాగా, ప్రముఖ కృత్రిమ మేధ సంస్థ ఆంత్రోపిక్ తమ కంపెనీలోని 5 శాతం వాటాను ప్రజాప్రయోజనాల కోసం తాము ఏర్పాటు చేసే నిధికి కేటాయిస్తామని ఆదివారం ప్రకటించింది. ఆ తర్వాత ఒక్కరోజు వ్యవధిలోనే అమెరికాలోని ప్రతి బిడ్డకూ తన స్పేస్‌ఎక్స్ సంస్థకు చెందిన ఒక షేరును ఫ్రీగా ఇస్తానని మస్క్ ప్రకటించడం గమనార్హం. అయితే ఈ ఉచిత షేర్ల పంపిణీకి సంబంధించి టెస్లా అధినేత ఎలాన్ మస్క్ పూర్తి వివరాలను వెల్లడించలేదు. ఏ వయసు పిల్లలు అర్హులు, షేర్లను నేరుగా పిల్లలకు బదిలీ చేస్తారా లేదా తల్లిదండ్రుల ఆధ్వర్యంలో మేనేజ్ చేసే అకౌంట్లలో జమ చేస్తారా అనే విషయంపై క్లారిటీ ఇవ్వలేదు. అయినప్పటికీ అమెరికాలోని కోట్లాది మంది చిన్నారులకు స్టాక్ మార్కెట్‌ను పరిచయం చేయడానికి మస్క్ తీసుకున్న ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని టెక్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

**మస్క్ నిర్ణయంపై ప్రపంచవ్యాప్తంగా చర్చ**

కాగా, మస్క్ తీసుకున్న ఈ నిర్ణయంపై అమెరికా వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. రాకెట్లు, స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ నెట్‌వర్క్, స్టార్‌షిప్ ప్రాజెక్టులతో అంతరిక్ష రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఎలాన్ మస్క్, ఇప్పుడు చిన్నారులకు కూడా కంపెనీలో భాగస్వామ్యం కల్పించడం ద్వారా మరో సరికొత్త ట్రెండ్‌కు తెరతీశారనే వాదన వినిపిస్తోంది. వచ్చే ఏడాది ఈ ఉచిత షేర్ల ప్లాన్ ఎలా అమలవుతుందనే అంశంపై అమెరికాలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోంది.




**ముకేశ్ అంబానీపై మస్క్ విమర్శలు**

కాగా, భారత్‌లో ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవల ప్రారంభంపై వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ లక్ష్యంగా మస్క్ తీవ్ర విమర్శల పరంపరను కొనసాగిస్తున్నారు. అంబానీ మద్దతుదారులు అర్థంపర్థంలేని వాదనలు చేస్తున్నారని ఇటీవలే ఆరోపించారు. పోటీ ఎప్పుడూ సామాన్య వినియోగదారులకు మేలు చేస్తుందని తెలిపారు. కొత్త సంస్థలు రంగంలోకి రావడం వల్ల వినియోగదారులకు ఎంపికలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. స్టార్‌లింక్ రాకతో అంబానీ లాభాలు కొంత తగ్గినా, ఆయన వ్యాపారం మూతపడే పరిస్థితి ఉండదని ఎద్దేవా చేశారు. మరోవైపు భారత్‌లో స్టార్‌లింక్ సేవల ధరలు మరీ ఎక్కువగా ఉంటే వినియోగదారులు వాటిని కొనుగోలు చేయరని అన్నారు.

**ఆంత్రోపిక్ నిర్ణయం వెలువడిన మరుసటి రోజే**

కాగా, ప్రముఖ ఏఐ సంస్థ ఆంత్రోపిక్ తమ కంపెనీలోని 5 శాతం వాటాను ప్రజా ప్రయోజనాల కోసం తాము ఏర్పాటు చేసే నిధికి కేటాయించాలని ఆదివారం నిర్ణయించింది. ఈ నిర్ణయంపై ఎలాన్ మస్క్ ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. వాటాలను ప్రజానిధికి బదులుగా నేరుగా ప్రజలకే ఇవ్వాలని అన్నారు. తాను కూడా భవిష్యత్తులో ఇదే చేయబోతున్నానని ప్రకటించారు. కాగా, ఆంత్రోపిక్ ఏర్పాటు చేయనున్న ఈ నిధికి 'ఆంత్రోపిక్ పబ్లిక్ బెనిఫిట్ ఫండ్' అని పేరు పెట్టారు. ఆ కంపెనీలో 5 శాతం వాటాను ఈ నిధికి కేటాయించనున్నారు. సంస్థ విలువ 50 శాతం పెరిగిన ప్రతి సారి మరో 2 శాతం వాటాలను అదనంగా నిధికి ఇవ్వనున్నారు. ఈ నిధి ద్వారా స్వచ్ఛంద సంస్థలకు విరాళాలు అందించడంతో పాటు అవసరమైన వర్గాలకు ఆర్థిక సాయం చేయనున్నారు. అదే విధంగా ఏఐ వల్ల ఉద్యోగ రంగంలో వచ్చే మార్పులు, కార్మికులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి దృష్టి పెట్టనున్నారు.

# శాంతిని కోరుకుంటున్న ఉక్రెయిన్

**దాడులతోనే సమాధానం ఇస్తున్న రష్యా**

**ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడుల నేపథ్యంలో శాంతికి తాము సిద్ధమేనన్న జెలెన్‌స్కీ**

**జయ జయహే**



యుద్ధాన్ని ముగించేందుకు తాము దౌత్యపరమైన అన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, రష్యా మాత్రం దాడులతోనే సమాధానమిస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ ఆవేదన వ్యక్తం చేశారు. కాల్పుల విరమణ కోసం వచ్చిన ప్రతి ప్రతిపాదనకు తాము సానుకూలంగా స్పందించామని, కానీ రష్యా హింసామార్గం వీడటం లేదని ఆయన ఆరోపించారు.

రష్యా సైన్యం బాలిస్టిక్ క్షిపణులు, వివిధ రకాల డ్రోన్లతో కీవ్‌తో పాటు పలు నగరాలపై విరుచుకుపడిందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో అనివార్యంగా తాము ఎదురుదాడికి దిగాల్సి వస్తోందని చెప్పారు. విన్నిట్సియా, కీవ్, మైకోలైవ్, ఖార్కివ్, ఒడెస్సా సహా 11 ప్రాంతాల్లోని ఇంధన మౌలిక సదుపాయాల కేంద్రాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని, వీటిలో పదికి పైగా కేంద్రాలు ధ్వంస మయ్యాయని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. "మేం ఈ యుద్ధాన్ని ఎన్నడూ కోరుకోలేదు. గౌరవప్రదంగా యుద్ధాన్ని ముగించేందుకు మా మిత్ర దేశాలు చేసిన ప్రతి ప్రయత్నాన్ని స్వాగతించాం. కానీ రష్యా మాత్రం పదేపదే బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్ దాడులు, హత్యలతోనే ప్రతిస్పందిస్తోంది" అని ఆయన వ్యాఖ్యానించారు. యుద్ధాన్ని ఆపేందుకు లేదా ఉద్రిక్తతలను తగ్గించేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఏమాత్రం ఆసక్తి లేదని ఆయన విమర్శించారు. గత కొంతకాలంగా అమెరికా తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు పరోక్షంగా ప్రయోజనం చేకూరుస్తున్నాయని జెలెన్‌స్కీ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మాస్కోపై ఉన్న ఆంక్షలను వాషింగ్టన్ సడలించడం, రష్యా నుంచి డీజిల్ దిగుమతి చేసుకునేందుకు ఒప్పందం చేసుకోవడం వంటి చర్యలను ఆయన తప్పుబట్టారు. రష్యా దాడులకు సంబంధించిన నిఘా సమాచారాన్ని గతంలో పంచుకున్న భాగస్వామ్య దేశాలు, ఇప్పుడు ఆ విషయంలో మౌనం వహిస్తున్నాయని వాపోయారు. అమెరికా తయారీ 'పేట్రియాట్' గగనతల రక్షణ వ్యవస్థల కొరత కూడా తమ దేశాన్ని రక్షణ పరంగా మరింత బలహీన పరిచిందని ఆయన పేర్కొన్నారు.



# పైడిమాంబ అమ్మవారికి సారె ఊరేగింపు

**దేవరాపల్లి, అక్టోబర్ 19, జయ జయహే :**

మండలంలోని కొత్తపెంట గ్రామంలో ప్రతి ఏటా మాదిరిగానే దసరా ముందు రోజున దుర్గాదేవి అమ్మవారి నుంచి కొత్తూరు పైడిమాంబ ఆలయం వరకు సోమవారం సారె ఊరేగించి అనంతరం పైడిమాంబ అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి, తమ మొక్కలను చెల్లించుకోవడం ప్రతి ఏడాది ఈ గ్రామంలో వస్తున్న ఆచారంగా ఈ గ్రామ ప్రజలు భావిస్తారు. ఈ ఏడాది ఊరేగింపు కార్యక్రమం మాజీ సర్పంచ్ రోంగలి వెంకటరావు (నీలిమ) ఆధ్వర్యంలో గ్రామంలోని మహిళలు, యువత, పెద్దలు అంతా కలిసి పెద్ద ఎత్తున బయలుదేరి అమ్మవారికి పది రకాల పిండి వంటలను తయారు చేసి నైవేద్యంగా పెట్టి, మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమంలో భక్తులకు ఈ పిండి వంటలు పంపిణీ చేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంతో ఆ గ్రామమంతా సందడిగా మారింది.



# ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా లాడ్జీలు హోటల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు

**అనకాపల్లి జయ జయహే**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా వాతావరణంలో నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా లాడ్జిలు హోటల్ లో పోలీసు అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు ఎన్నికలవేళ శాంతి భద్రతలకు విఘాతం కలిగించడానికి బయట ప్రాంతాల నుంచి వచ్చే అనుమానాస్పద వ్యక్తులు రౌడీషీటర్లు అసాంఘిక శక్తులు కదలికలను గుర్తించేందుకు పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు అనకాపల్లి టౌన్ ఎస్ఐ షేక్ జిలాని మరియు సిబ్బంది పట్టణ పరిధిలోని అన్ని ప్రధాన లాడ్జిల్లో హోటల్లో తనిఖీలు నిర్వహించారు ఈ తనిఖీల్లో భాగంగా అధికారులు లాడ్జిల్లా వసతి చేస్తున్న వారి గుర్తింపు కార్డులు బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది . ఇప్పటివరకు నిర్వహించిన తనిఖీలలో ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు గాని అవాంఛనీయ కార్యకలాపాలు గాని ఎక్కడ గుర్తించబడలేదు లాడ్జి మరి హోటల్ యజమానులకు పోలీసులు గదులు కేటాయించే సమయంలో విధిగా ఆధార్ కార్డు లేదా ప్రభుత్వ జారీ చేసిన గుర్తింపు కార్డులను పరిశీలించి రిజిస్టర్ల పూర్తిగా వివరాలను నమోదు చేయాలని సిసిటివి కెమెరాలు నిరంతరం పనిచేసే ఏర్పాటు చేసుకోవాలని ఎవరైనా కొత్తవారు అనుమానాస్పద వ్యక్తులు బస చేసినా లేదా అనుమానస్పద వస్తువులు కనిపించిన ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని నిబంధన ఉల్లంఘిస్తాయి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ శాఖ హెచ్చరించింది జిల్లాలో నర్సీపట్నం ఎలమంచిలి లో కూడా తనిఖీలు నిర్వహించడం జరిగింది

# ఎల్ నినో నేపథ్యంలో.... భట్టి అధ్యక్షతన క్యాబినెట్ సబ్ కమిటీ

**జయ జయహే**

ఎల్ నినో పరిస్థితులపై తెలంగాణ ప్రభుత్వం మంత్రివర్గ ఉప- సంఘం ఏర్పాటు సూపర్ డూపర్ ఎల్ నినో దెబ్బకు ప్రపంచం మొత్తం అతలాకుతలమవుతోంది. ఈ ఏడాది రుతుపవనాల సీజన్‌లో కురువాల్సిన వర్షపాతం కంటే తక్కువ స్థాయిలో నమోదయ్యింది. దీంతో పంటలు ఎండిపోయి తాగునీటికి కూడా ఇబ్బందికర పరిస్థితి ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో ఎల్ నినో పరిస్థితులపై సమీక్షకు తెలంగాణ ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లును అధ్యక్షుడిగా నియమిం చింది. ఈ కమిటీలో మరో ఐదుగురు మంత్రులు సభ్యులుగా ఉన్నారు. రాష్ట్రంపై ఎల్ నినో ప్రభావం, దాని పర్యవసానాలపై సమీక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ క్యాబినెట్ సబ్-కమిటీలో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరిలను సభ్యులుగా నియమించింది. ప్రత్యేక ఆహ్వానితుడిగా సీఎం సలహాదారు రామకృష్ణారావును నియమించగా సబ్-కమిటీ కన్వీనర్‌గా ప్రణాళిక శాఖ కార్యదర్శి వ్యవహరించనున్నారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులు వెలువరించారు. ఎల్‌నినో, రాష్ట్రంలో కరువు పరిస్థితులపై మంత్రివర్గ ఉప సంఘం సమీక్షించి, సంబంధిత శాఖలకు ఎప్పటికప్పుడు ఆదేశాలు, సూచనలు, సలహాలు అందజేస్తుంది. కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై కూడా నివేదికలను సమర్పించనుంది. గ్రామీణ ప్రాంతాల్లోనూ తాగునీటికి ఇబ్బంది రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై కూడా సూచనలు ఇవ్వనుంది. గతవారం ఎల్ నినో పరిస్థితులపై అందుబాటులో ఉన్న మంత్రులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యసర సమావేశం ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా కోవిడ్-19 తరహా పరిస్థితులు ఎదుర్కొనక తప్పదని ఆయన పేర్కొన్నారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com